ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5 కర్ణాటక వార్తలు

గురువారం 13 నవంబరు 2025

అడవుల వైపు ఏనుగుల మళ్లింపు

బెంగళూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కొడగు జిల్లాలో ఏనుగుల దాడిలో కార్మికుడు బలైన నేపథ్యంలో అటవీశాఖ అప్రమత్తమైంది. ఏనుగులను దట్టమైన అడవులలోకి మళ్లించే ప్రక్రియ చేపట్టారు. పాలిబెట్ట సమీపంలోని ఎమ్మెగుండి కాఫీతోటలో 9 ఏనుగుల గుంపు సంచరిస్తోంది. వీటిలోనుంచి ఒక ఏనుగు సోమవారం కార్మికుడిపై దాడిచేసి బలిగొంది. ప్రస్తుతం ఏనుగులను అడవులలోకి మళ్లిస్తున్నారు. 9 ఏనుగులు వేర్వేరు ప్రాంతాలలో సంచరిస్తుండటంతో కార్యాచరణలో జాప్యం అవుతోంది. అటవీప్రాంతాలకు అనుబంధమైన గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

మరోసారి ఉత్తర కర్ణాటక నినాదం..!



- అన్యాయాన్ని సరిదిద్దకపోతే పోరాటమే
- రాష్ట్రపతి, ప్రధానికి కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజు కాగె లేఖ
- ప్రత్యేక డిమాండ్ తలెత్తకూడదనే సువర్ణ సౌధ ఏర్పాటు


బెళగావి సువర్ణసౌధ వద్ద కర్ణాటక వికాస వేదిక ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న నాయకులు

బెంగళూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత్‌ను భాషాపరంగా రాష్ట్రాల విభజన జరిగిన తర్వాత కూడా ప్రత్యేక రాష్ట్ర డిమాండ్లు తెరపైకి వచ్చాయి. ఆరు దశాబ్దాల కుపైగా ఈ నినాదం అప్పుడప్పుడు తెరపైకి వస్తోంది. తమిళనాడు, కేరళ రాష్ట్రాలలో ప్రత్యేకత అనే ప్రతిపాదన లేదు. ఆంధ్రప్రదేశ్‌లో ఓ చిన్న ప్రతిపాదన పెను ఉద్యమంగా మారి ఏకంగా రెండు రాష్ట్రాలుగా విడిపోయిన విషయం తెలిసిందే. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రాష్ట్రాలుగా విభజించి పుష్కరం దాటిపోయింది. ఇదే నినాదం కర్ణాటకలోనూ తరచూ తెరపైకి వస్తోంది. గతంలో రాజకీయ నాయకులు వారి సమస్యలు పరిష్కరించుకునేందుకు సంచలనం కోసం ప్రత్యేక రాష్ట్రం డిమాండ్ చేసేవారు. అలా డిమాండ్ తలెత్తిన ప్రతిసారి రాజకీయ ప్రత్యర్థులు విమర్శలు చేసేవారు. బీజేపీలో సీనియర్ నేతగా పలుసార్లు మంత్రిగా వ్యవహరించిన దివంగత ఉమేశ్ కత్తి పలు సందర్భాలలో వెనుకబడిన ఉత్తర కర్ణాటక ప్రత్యేక రాష్ట్రం కావాలని డిమాండ్ చేసేవారు. తాజాగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ ఎమ్మెల్యే, బెళగావి డీసీసీ బ్యాంకు డిప్యూటీ చైర్మన్ హోదాలో ఉన్న రాజుకాగె అదే ప్రతిపాదన చేశారు. ఈ పరిణామం ప్రతిపక్ష బీజేపీకి అస్త్రంగా మారింది. అధికార పార్టీ కాంగ్రెస్‌లో ఎన్నో అంతర్గత సమస్యలు ఉన్నాయి. తాజాగా మరో వివాదం కాంగ్రెస్ నేతలపై పడింది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన అయి తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరుణంలో ఉత్తర కర్ణాటక కూడా ప్రత్యేక రాష్ట్రం కావాలని కర్ణాటక వికాస వేదిక పోరాటం చేస్తోంది. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల తరహాలోనే ఉత్తర కర్ణాటకను సమగ్ర అభివృద్ధి చేయాలని, ఈ ప్రాంతానికి జరిగిన అన్యాయాన్ని సరిచేయాలని లేనిపక్షంలో ప్రత్యేకరాష్ట్రంగా విభజించాలని డిమాండ్ చేస్తున్నారు. వికాస వేదిక కోటిమందికి పైగా సంతకాలను సేకరించారు. వీరి ప్రధాన డిమాండ్లలో బెళగావిని రెండో రాజధానిగా అధికారికంగా ప్రకటించాలని బెళగావిలోని 'సువర్ణసౌధ'లో రాష్ట్రస్థాయి సెక్రటేరియట్ ఏర్పాటు చేయాలని, రాష్ట్రస్థాయి కార్యాలయాలను సువర్ణసౌధకు తరలించాలని, కిత్తూరు కర్ణాటక అభివృద్ధి మండలి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఉత్తర కర్ణాటక పోరాట సమితి, ఉత్తర కర్ణాటక వికాస వేదికతోపాటు పలు సంఘాలు బెళగావిలోని సువర్ణసౌధ వద్ద మంగళవారం నిరసన చేపట్టాయి. పోరాటవాదులలో ఒకరైన న్యాయవాది బీడీ హిరేమఠ మాట్లాడుతూ.. బెళగావిలో జరిగే శాసనసభ శీతాకాల సమావేశాలలో ఉత్తర కర్ణాటక సమగ్ర అభివృద్ధిపై ఎమ్మెల్యేలందరూ చర్చలు జరపాలని మా ప్రధానమైన ప్రతిపాదన అన్నారు. ఏడాదికోసారి జరిగే శాసనసభ శీతాకాల సమావేశాలలో సంపూర్ణంగా ఉత్తర కర్ణాటక సమస్యలపై చర్చలు జరగలేదన్నారు. ఇదే తరహాలోనే నిర్లక్ష్యం చేస్తే ఉత్తరకర్ణాటక జెండాను సువర్ణసౌధపై ఎగురవేస్తామని హెచ్చరించారు. మరోపోరాట నేత అశోక్‌పూజారి మాట్లాడుతూ ఉత్తర కర్ణాటక సమస్యలపై సమగ్రమైన చర్చలతోపాటు హామీలలో స్పష్టత లేకుంటే వెనుకడుగు వేసే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. ప్రస్తుతం బంతి ప్రభుత్వకోర్టులోనే ఉందని వారే తేల్చుకోవాలన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే బెళగావి రాజధాని కావడంలో ఎటువంటి సందేహం ఉండదన్నారు. పదేళ్లకాలంగా సువర్ణసౌధకు రాష్ట్రస్థాయి కార్యాలయాలు కొన్ని కేటాయిస్తామని అమలు చేయలేదన్నారు. బెంగళూరులోని విధానసౌధలో పనిచేసే ఉద్యోగులలో 82శాతం మంది అధికారులు దక్షిణ కర్ణాటకకు చెందినవారే ఉన్నారన్నారు. మాకు లభించాల్సిన సౌకర్యాలు అందడం లేదన్నారు. 2016 నుంచి ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను సేకరిస్తున్నామన్నారు. తాజాగా కోటిమంది సంతకాలు సేకరించామన్నారు. 13 ఏళ్లుగా మా పోరాటానికి కనీసమైన స్థాయిలో కూడా ప్రభుత్వం పట్టించుకోకపోవడాన్ని ఏమని అర్థం చేసుకోవాలని ప్రశ్నించారు.

ఉత్తర కర్ణాటక ప్రత్యేక రాష్ట్రం కావాల్సిందే...

- రాష్ట్రపతి, ప్రధానమంత్రికి కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజు కాగె లేఖ



ఉత్తర కర్ణాటక ప్రత్యేక రాష్ట్రం చేయాలనే డిమాండ్ 13ఏళ్లుగా సాగుతోంది. గతంలో బెళగావికి చెందిన బీజేపీ సీనియర్ నేత ఉమేశ్‌కత్తి ప్రత్యేకరాష్ట్రం కావాలని డిమాండ్ చేసేవారు. అదే తరహాలోనే ప్రస్తుత అధికార పార్టీ కాంగ్రెస్‌కు చెందిన సీనియర్ ఎమ్మెల్యే రాజుకాగె ఏకంగా ప్రత్యేకరాష్ట్రం కోరుతూ రాష్ట్రపతి, ప్రధానమంత్రులకు లేఖలు పంపారు. 15 జిల్లాలకు అనుబంధంగా ఉత్తర కర్ణాటక ఏర్పాటు చేయాలని లేఖలో పేర్కొన్నారు. అభివృద్ధి విషయంలో ఉత్తర కర్ణాటకకు అన్యాయం జరుగుతోందని, సవతితల్లి ప్రేమ చూపుతున్నారని మండిపడ్డారు. కల్యాణ కర్ణాటక, కిత్తూరు కర్ణాటకకు అనుబంధమైన 15 జిల్లాలను కలుపుతూ ప్రత్యేక రాష్ట్రం కావాలన్నారు.

- దేశంలో ప్రస్తుతం 30 రాష్ట్రాలు ఉన్నాయి. వీటిని 50గా పెంచాలనే చర్చలు సాగుతున్నాయి. ఉత్తరప్రదేశ్‌లో 21కోట్లమంది జనాభా ఉన్నారు. వాటిని 4 రాష్ట్రాలుగా విభజించాలని, 11కోట్లమంది జనాభా కల్గిన మహారాష్ట్రను మూడు రాష్ట్రాలుగా విభజించాలని డిమాండ్ ఉంది. 6.5కోట్లమంది జనాభా కల్గిన కర్ణాటకను రెండుగా చేయాలని పలుమార్లు దివంగత ఉమేశ్‌కత్తి డిమాండ్ చేశారు. 9సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన నాకు ముఖ్యమంత్రి అయ్యే అర్హత ఉందని, పలు సందర్భాలలో వ్యాఖ్యానించారు. ఇటీవల పోరాట సమితి మినహా రాజకీయ నాయకులు ఎవరూ డిమాండ్ చేయలేదు. రాజుకాగె వ్యాఖ్యలు రాష్ట్రవ్యాప్తంగా బుధవారం సంచలనానికి కారణమైంది.

ప్రత్యేక డిమాండ్ రాకూడదనే సువర్ణసౌధ

ప్రత్యేక రాష్ట్ర డిమాండ్ రాకూడదని, పొరుగున ఉండే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పరిస్థితి తలెత్తరాదని దశాబ్దన్నర కిందటే మహత్తరమైన నిర్ణయాన్ని తీసుకున్నారు. 2007లో కుమారస్వామి సీఎంగా ఉన్నప్పుడు ప్రత్యేకరాష్ట్ర డిమాండ్ సరికాదని సమగ్ర కర్ణాటక లక్ష్యంగా ఉండాలని భావించి బెళగావిలో సువర్ణసౌధ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు. అందుకు అనుగుణంగానే శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత 2009లో ముఖ్యమంత్రిగా వచ్చిన యడియూరప్ప నిర్మాణాలను వేగవంతం చేశారు. మూడేళ్ల వ్యవధిలో సుందరమైన సువర్ణసౌధను నిర్మించారు. ఇక్కడ అసెంబ్లీహాల్‌లో 300మంది కూర్చునే విధంగానే, పరిషత్‌లో వందమంది కూర్చునే హాల్‌ను, 450మంది కూర్చునే తరహాలో ప్రత్యేక సమావేశభవనాన్ని నెలకొల్పారు. 38మంది మంత్రుల చాంబర్లు నిర్మించారు. 14 సమావేశ మందిరాలను ఏర్పాటు చేశారు. బెంగళూరు విధానసౌధలో ఏ విధమైన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయో అదే తరహాలోనే ఇక్కడ సంపూర్ణంగా ఉండేలా నిర్మించారు. ఇందుకోసం దాదాపు 400 కోట్లు ఖర్చు చేశారు. 2012 అక్టోబరులో అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ సువర్ణసౌధను ప్రారంభించారు. ప్రతి ఏటా శాసనసభ శీతాకాల సమావేశాలు నిర్వహిస్తున్నారు. రెండువారాలపాటు జరిగే సమావేశాలలో ఉత్తర కర్ణాటక సమస్యలపై ప్రధాన చర్చ జరగాలనే డిమాండ్ ఉంది. కానీ ఆచరణలో అమలు కావడం లేదు.

సరిహద్దులో మరాఠాల వివాదం - కొత్త సమస్యకు తెరలేపొద్దు

కర్ణాటకలో చివరన ఉండే బెళగావి జిల్లాలో దశాబ్దాల కాలంగా మరాఠాల సమస్య కొనసాగుతోంది. బెళగావితోపాటు అనుబంధ తాలూకాలను మహారాష్ట్రలో విలీనం చేయాలని మరాఠాలు డిమాండ్ చేస్తున్నారు. ఇందుకోసం మహారాష్ట్ర ఏకీకరణ సమితి (ఎంఈఎస్) ఏర్పడింది. వీరికి మహారాష్ట్రలోని శివసేన, ఉద్ధవ్‌ఠాక్రే వర్గం సంపూర్ణమద్దతు ఇస్తోంది. ఉద్ధవ్‌ఠాక్రే సీఎంగా ఉన్నప్పుడు బెళగావిని కలుపుకుంటామనే రీతిలో వ్యాఖ్యలు చేశారు. ఏటా రాష్ట్రమంతటా నవంబరు 1న కన్నడ రాజ్యోత్సవ వేడుకలు జరిగే సమయంలో బెళగావిలో విమోచనా దినం పేరిట నిరసన చేస్తారు. ఐదారేళ్లకాలంలో ఈ వివాదం మరింత తీవ్రమవుతోంది. ఇలా సాగుతున్న తరుణంలో ప్రత్యేకరాష్ట్రం అనే ప్రతిపాదన సరికాదని కన్నడసంఘాల ఐక్యకూటమితోపాటు కర్ణాటక రక్షణ వేదిక వంటి సంస్థలు మండిపడుతున్నాయి. భాష, నీరు, నేల, సరిహద్దు విషయంలో రాజీ ప్రసక్తే లేదని తేల్చిచెబుతున్నాయి. విభజన అంశం కొందరికి చెలగాటంగా ఉందని, అది సమగ్ర కర్ణాటకకు సమంజసం కాదని హెచ్చరిస్తున్నారు.



సైకిళ్లపై పుట్టపర్తికి బయలుదేరిన విద్యార్థులు

సత్యసాయిబాబా శతజయంతికి సైకిల్ యాత్ర

బెంగళూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శతజయంతిని పురస్కరించుకుని సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లర్నింగ్ విభాగం ప్రత్యేక సైకిల్ యాత్రను జరిపారు. బుధవారం కాడుగోడిలోని బృందావన క్యాంపస్ నుంచి ఉదయం 7 గంటలకు సైక్లింగ్‌ను ప్రారంభించారు. 150మంది సైక్లిస్టులు నందగిరి క్యాంపస్ మీదుగా పుట్టపర్తిలోని ప్రశాంతినిలయం దాకా వెళ్లనున్నారు. 161 కిలోమీటర్లను రెండు రోజులలో పూర్తి చేయదలిచారు. గురువారం సాయంత్రం వారు ప్రశాంతినిలయంలోని హిల్‌వ్యూ స్టేడియానికి చేరుకుంటారు. ప్రొఫెసర్ రాఘవేంద్రరావు జెండా ఊపి ప్రారంభించారు. సంస్థ రిజిస్ట్రార్ శ్రీకాంత్ కణ్ణా తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు అత్యధికంగా ఉన్నారు. సత్యసాయిబాబా శతజయంతి సందర్భంగా ప్రత్యేక సైకిల్ యాత్ర చేస్తున్నట్లు ప్రకటించారు. సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లర్నింగ్ క్యాంపస్ డైరెక్టర్‌లు, డీన్‌లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్వాంటమ్ ఎకో సిస్టమ్ మ్యాప్ రూపొందించండి

- అధికారులకు మంత్రి బోసరాజు సూచన


మంత్రి బోసరాజుతో స్విస్‌నెక్స్ సీఈఓ ఏంజెలా హొనగ్గర్

బెంగళూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): క్వాంటమ్ ఎకోసిస్టమ్ మ్యాప్‌ను రూపొందించాలని అధికారులకు సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి బోసరాజు సూచించారు. స్విస్‌నెక్స్ క్వాంటమ్‌మ్యాప్ తరహాలో తయారు చేయాలన్నారు. స్విస్‌నెక్స్ సీఈఓ జనరల్ ఇండియా ఏంజెలా హొనగ్గర్‌తో సభ జరిపారు. బుధవారం వికాససౌధలో సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం అధికారులతో చర్చించారు. కర్ణాటక, స్విట్జర్లాండ్ మధ్యన పరిశోధనలు, సాంకేతిక వినిమయం కోసం వేదిక కల్పించే విషయంలో సమగ్ర చర్చలు జరిగాయన్నారు. స్విస్‌నెక్స్ సీఈఓ ఏంజెలా హొనగ్గర్ క్వాంటమ్‌రంగంలో ఆవిష్కరణలు, పరిశ్రమల స్థాపనకు కలసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కెస్టెప్స్ ఎండీ సదాశివ ప్రభు, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ ప్రొఫెసర్ అరిందమ్ ఘోష్, స్విస్‌నెక్స్ సంస్థ హెడ్ ఆఫ్ ఇన్నోవేషన్ రాహుల్ కులశ్రేష్ఠ, మంత్రి కార్యదర్శి వీరభద్ర హంచినాళ్ పాల్గొన్నారు.


నకిలీ పత్రాలతో రూ.వందల కోట్ల మోసం

- 14 మందిపై ఎఫ్ఐఆర్

మహదేవపుర, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): బండాపూర్ గ్రామంలోని సర్వే నెంబర్లు 20, 21, 44/1లకు చెందిన భూములను నకిలీపత్రాల ద్వారా అక్రమాలకు పాల్పడిన సంఘటన వెలుగుచూసింది. ఈకేసులో 14మందిపై అవలహళ్ళి పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. భూ యజమాని వెంకటప్ప ఫిర్యాదు మేరకు బెంగళూరు బసవేశ్వరనగర్ 3వ బ్లాక్ ఇంటి నెంబరు 130లో ఉంటున్నాని, భూముల హక్కులు తమపేరిట ఉన్నాయని పేర్కొన్నారు. నిందితులు అశ్విని సాంచెటి, రాధా, లోక్‌సుందర్, ధ్రువకుమార్, మీనాక్షి, లావణ్య తదితరులు స్టాంప్‌పేర్ల ద్వారా మోసాలకు పాల్పడ్డారన్నారు. నకిలీ జాయింట్ డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ (జేడీఏ), జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ (జీపీఏ) ద్వారా కోట్ల రూపాయల లావాదేవీలు చేశారన్నారు. అవలహళ్ళి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

సహస్ర చండీ యజ్ఞం

దొమ్మసంద్ర, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్యసాయిబాబా శతజయంతి సందర్భంగా కగ్గదాసపురలోని హృదయస్పందన ఆధ్వర్యంలో ఈనెల 4న ప్రారంభమైన సహస్రచండీ యజ్ఞం మంగళవారంతో ముగిసింది. లోకకల్యాణార్థం సురభారతి సంస్కృత, కల్చరల్ ఫౌండేషన్‌లో కార్యక్రమం కొనసాగింది. ముగింపురోజు 10 అగ్నిగుండాల చుట్టూ వందమందికిపైగా వేదపండితులు దుర్గసప్తశతి పారాయణ చేశారు. 55కుపైగా ద్రవ్యాలను హోమగుండంలో సమర్పించారు. గోదానం, దశదాన కార్యక్రమాలు సాగాయి. అనంతరం వేదపండితులను సత్కరించారు. సురభారతి సంస్థ ముఖ్యులు విద్వాన్ శ్రీనివాసన్ నేతృత్వంలో కార్యక్రమాలు జరిగాయి.


వేదపారాయణంలో రుత్విజులు


జ్యోతి వెలిగించి సమావేశాన్ని ప్రారంభిస్తున్న సీఎం సిద్దరామయ్య

అందరికీ మంచోడు అనంతరామయ్య

- కురుబ సంఘం సభలో సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వాగ్ధాటి, హాస్యం, పలు అంశాల ప్రస్తావన ఇది సీఎం సిద్దరామయ్య ప్రసంగం విధానం. అటువంటిది బుధవారం బెంగళూరు గాంధీనగర్‌లో కురుబ సమాజం కోసం హాస్టల్ భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో సీఎం మాట్లాడుతూ.. అందరికీ మంచోడు అనంతరామయ్య... అంటూ తెలుగు సామెతను ప్రస్తావించారు. కురుబ సంఘంతోపాటు అన్ని కులసంఘాలకు కార్పొరేషన్లు, సామూహిక భవనాల ఏర్పాటు చేశానన్నారు. సంగొళ్ళిరాయణ్ణ ప్రాధికార, కాగినెలె గురుపీఠం ఏర్పాటు చేశానన్నారు. ఏం చేసినా మంచి, చెడు బహిరంగంగా చెబితే నిష్ఠూరం అవుతామని, అందరికీ మంచోడు అనంతరామయ్య తరహాలో ఉన్నారన్నారు. మైసూరులో సీఏ సైట్ ఏర్పాటు చేసి విద్యార్థులకు హాస్టల్, సంగొళ్ళిరాయణ్ణ పేరిట సైనిక్ స్కూల్‌కు రూ.300కోట్లు కేటాయించానన్నారు. అన్ని కులాలకు ధ్వనిగా ఉండాలనే కాగినెలె పీఠాన్ని స్థాపించానన్నారు. నేను మొదటి నుంచి సనాతనవాదినని, ఆర్ఎస్ఎస్‌కు వ్యతిరేకమని, కులవ్యవస్థ, మూఢనమ్మకాలను వ్యతిరేకిస్తానన్నారు. కురుబ కులస్థుల పిల్లలకు హాస్టల్ ఉండాలనేది నా ఆశయమన్నారు. వందేళ్లకిందటి భవనాన్ని తొలగించి ఆధునాతన సౌకర్యాలతో భవనం నిర్మించదలిచామన్నారు. ఇదే భవనంలో చదివినవారు మంచి అధికారులుగా, జడ్జిలుగా ఉన్నారన్నారు. 1984లో మంత్రిగా ఉన్నప్పుడు కనకదాస 500వ జయంతి ఉత్సవం జరిపానన్నారు. అందుకే సమాజానికి ఒక గురుపీఠం ఉండాలనే భావించానన్నారు. ప్రభుత్వం నుంచి అన్ని ప్రాంతాలలోనూ కురుబ కులస్థులకు భవనాలు నిర్మించాలనే ప్రతిపాదన ఉందన్నారు. బీసీలు, ఎస్సీ వర్గాలు అభివృద్ధి చెందితేనే సమాజంలో మార్పు సాధ్యమన్నారు. ఇదే సందర్భంలోనే రౌడీ కొత్వాల్ రామచంద్రతో ఉన్న పుట్టస్వామి నుంచి నాకు బెదిరింపులు వచ్చాయని, కురుబసంఘం విషయంలో జోక్యం చేసుకోరాదని హెచ్చరించారన్నారు. కానీ నేను భయపడలేదన్నారు. దావణగెరె మల్లప్పను పోటీ చేయించానని, పుట్టస్వామికి వ్యతిరేకంగా నిలిచానన్నారు. కోర్టుకు వెళ్లినా మాకే న్యాయం జరిగిందన్నారు. కార్యక్రమంలో మంత్రి బైరతి సురేశ్, మాజీ మంత్రి రేవణ్ణ, బండెప్పకాశంపూర్‌తో పాటు కురుబ సంఘం ముఖ్యులు, పలువురు స్వామీజీలు పాల్గొన్నారు.

రసవత్తరంగా మేయర్ ఎన్నిక..!

- రాజకీయ కురువృద్ధుల పోటాపోటీ
- ఆరుగురు కార్పొరేటర్ల సిగపట్లు
- నేడు అధిష్టానం నుంచి పరిశీలకుల రాక

9

రబీ పంటకు నీరివ్వాలని రైతుల పాదయాత్ర

17న తుంగభద్ర జలాశయం వద్ద ధర్నా


విచారణకు వచ్చిన పోలీసులపై దాడి

- ఎస్ఐ, ఏఎస్ఐకి గాయాలు


ఏఎస్ఐని ఇంట్లో కట్టేసే ప్రయత్నం చేస్తున్న రామకృష్ణ, సక్కుబాయి

రాయచూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని లింగసుగూరు తాలూకా మట్టూరు తండాలో ఒక కేసు విచారణ కోసం వచ్చిన పోలీసులపై రామకృష్ణ, సక్కుబాయి దంపతులు దాడి చేశారు. ఈ ఘటన బుధవారం చోటు చేసుకున్నట్లు పోలీసుల ద్వారా తెలిసింది. రామకృష్ణ(35), సక్కుబాయి(30) దంపతులు మట్టూరు తండాలో మరొక కుటుంబంతో జరిగిన గొడవ సందర్భంగా వారిపై దాడికి దిగగా వారికి వ్యతిరేకంగా లింగసుగూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఏఎస్ఐ వెంకటప్ప నాయక్ కేసు విచారణ కోసం రాగా ఆయనను దుర్భాషలాడుతూ చేతిలో ఉన్న సెల్‌ఫోన్‌ను లాగి వెలగొట్టడమేగాక ఆయన షర్ట్ చింపివేసి ఏకంగా ఇంట్లో కట్టేసే ప్రయత్నం చేసింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ వెంకటేశ్ అక్కడికి వెళ్లగా ఆయనపై కూడా తిరగబడి దాడికి దిగారు. ఈ ఘటనలో ఏఎస్ఐ, ఎస్ఐ ఇద్దరు గాయపడగా వారు లింగసుగూరు ఆస్పత్రిలో చికిత్స పొందారు. విషయం తెలుసుకున్న ముదగల్ పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

'తిథి' సినిమా ఫేం గడ్డప్ప మృతి



బెంగళూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జాతీయ పురస్కార గ్రహీత 'తిథి' సినిమా ఫేం గడ్డప్ప (89) మృతిచెందారు. వయోసహజ సమస్యలతో ఇబ్బంది పడుతున్న ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. మండ్య తాలూకా నొదకొప్పలు గ్రామానికి చెందిన చన్నేగౌడ 'తిథి' సినిమా తర్వాత 'గడ్డప్ప'గానే పేరొందారు. తిథి, తర్లె విలేజ్, జాని మేరా నామ్, హళ్ళి పంచాయతీ వంటి 8 సినిమాలలో నటించారు. మేకప్ లేకుండా సహజంగా నటించేవారు. ఆస్తమా, హృద్రోగ సమస్యలతో బాధపడుతున్న గడ్డప్ప నెలక్రితం కిందపడిన మేరకు నడుముకు శస్త్ర చికిత్స చేశారు. అప్పటి నుంచి పలు అనారోగ్య సమస్యలతో చికిత్సలు పొందుతున్న గడ్డప్ప బుధవారం మృతిచెందారు. గురువారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్టు కుమార్తె శోభా తెలిపారు.

అప్పుల ఉరికి కూలీ బలి

ధర్మవరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సత్యసాయినగర్‌కు చెందిన ప్రవీణ్‌కుమార్(28) అప్పులబాధతో బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపిన మేరకు... ప్రవీణ్‌కుమార్ కూలి పనులు చేసుకుంటూ భార్య, కుమారుడిని పోషించుకునేవాడు. కుటుంబ పోషణ కోసం బయట వ్యక్తులతో అప్పులు చేశాడు. అయితే తగినంత ఆదాయం లేకపోవడంతో అప్పులు ఎలా తీర్చాలంటూ తరచూ మథనపడేవాడు. మృతుడి తండ్రి దేవరకొండ నారాయణస్వామి మాత్రం కష్టపడి పని చేసి అప్పులు తీరుద్దామని ధైర్యం చెప్పేవాడు. కాగా 9 నెలల గర్భవతి అయిన భార్యను, ఐదేళ్ల కుమారుడిని మంగళవారం ఆమె పుట్టినిల్లు అయిన అనంతపురంలో వదిలి ప్రవీణ్‌కుమార్ తిరిగి ధర్మవరం వచ్చాడు. పట్టణంలోని వేరే ప్రాంతంలో నివాసం ఉంటున్న ప్రవీణ్‌కుమార్ తండ్రి బుధవారం ఇంటికి వచ్చాడు. వాకిలి వద్ద నిలబడి ఎంత పిలిచినా ప్రవీణ్ కుమార్ పలకకపోవడంతో స్థానికుల సాయంతో తలుపులు బద్దలు కొట్టి ఇంటిలోకి వెళ్లాడు. అక్కడ ఉరికి వేలాడుతున్న కుమారుడిని చూసి బోరుమంటూ విలపించాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

బంగారం నెక్లెస్ చోరీ

యాడికి, నవంబరు12(ఆంధ్రజ్యోతి): బస్సు ప్రయాణంలో 2.5తులాల బంగారం నెక్లెస్ చోరీ అయినట్లు నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం పోతుదొడ్డి గ్రామానికి చెందిన వెంకటలక్ష్మి బుధవారం ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈనెల 8న వెంకటలక్ష్మి 2.5తులాల బంగారు నెక్లెస్‌ను బ్యాగులో పెట్టుకొని అనంతపురం జిల్లా గుత్తి నుంచి బస్సులో రాయలచెరువుకు బయల్దేరారు. జక్కలచెరువు గ్రామ సమీపాన బ్యాగును పరిశీలించగా అది కత్తిరించినట్లు గుర్తించారు. అందులో పెట్టిన బంగారు నెక్లెస్ కూడా కనిపించలేదు. తొండపాడు వద్ద గుర్తుతెలియని మహిళలు బస్సులో నుంచి వేగంగా దిగి వెళ్లిపోయినట్లు తెలిపారు. వారిపై అనుమానం ఉన్నట్లు వెంకటలక్ష్మి ఫిర్యాదు చేశారని తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భార్య గొంతు కోసిన భర్త

కళ్యాణదుర్గం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోరంపల్లిలో బుధవారం కుటుంబ కలహాలతో భార్య గొంతు కోశాడు ఓ భర్త. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. బోరంపల్లికి చెందిన దంపతులు రత్నమ్మ, ఎర్రిస్వామి బుధవారం రాత్రి ఇంట్లో కుటుంబ సమస్యలతో వాగ్వాదానికి దిగారు. ఎర్రిస్వామి ఆవేశానికి లోనై ఇంట్లో ఉన్న చాకు తీసుకుని రత్నమ్మపై దాడి చేశాడు. ఆమె గొంతు కోయడంతో కుప్పకూలిపోయింది. చుట్టుపక్కల వారు వచ్చి చూశారు. అప్పటికే రత్నమ్మ రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతోంది. 108 వాహనంలో కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ఎర్రిస్వామి పరారయ్యాడు. రత్నమ్మ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. దీనిపై కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి

కుమార్తె చనిపోయిన మూడు రోజులకే కన్నుమూత



గంగమ్మ (ఫైల్)

కళ్యాణదుర్గం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కంబదూరులోని ఆర్డీటీ కాలనీకి చెందిన శతాధిక వృద్ధురాలు గంగమ్మ (102) బుధవారం మృతి చెందారు. చిన్న కుమారుడు గంగాధర వద్ద గంగమ్మ ఉండేవారు. వయోభారంతో కన్నుమూశారు. గంగమ్మ మృతదేహానికి స్వగ్రామంలో కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. ఆమెకు ముగ్గురు కుమారులు నారాయణప్ప, నాగరాజు, గంగాధర, కుమార్తె నారాయణమ్మ ఉన్నారు. ఇదివరకే పెద్ద కుమారుడు మరణించారు. మూడు రోజుల క్రితం కుమార్తె కూడా కన్నుమూశారు. బుధవారం గంగమ్మ చనిపోవడం పట్ల కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు.

మరో 15 పీజీ సీట్లు

వైద్య కళాశాలలో సంబరాలు



ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్‌ను అభినందిస్తున్న విభాగాధిపతులు

అనంతపురం వైద్యం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యవిద్య కళాశాలకు మరో 15 పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) సీట్లు మంజూరైనట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయశ్రీ తెలిపారు. పీడియాట్రిక్స్, గైనిక్, అనస్థీషియా విభాగాలకు నాలుగు చొప్పున, అడ్మినిస్ట్రేషన్‌కు మూడు సీట్లు మంజూరయ్యాయన్నారు. దీంతో మొత్తం సీట్ల సంఖ్య 136కి చేరిందన్నారు. బుధవారం విభాగాధిపతులు షంషాద్‌బేగం, రవికుమార్, నవీన్‌కుమార్, శౌరి, ఎస్ఎంసీ కమిటీ సభ్యులు ప్రవీణ్ డీన్, ప్రవీణ, శ్రావణి తదితరులు ప్రిన్సిపాల్ విజయశ్రీ, సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం, వైస్ ప్రిన్సిపాల్ షారోన్ సోనియాను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.

రాగిఫలకపై విజయనగర శాసనాలు

- శ్రీకాళహస్తిలో లభ్యం



రాగి శాసనాలను చూపుతున్న సింగరాజు మణి



విజయనగరం కాలం నాటి రాజముద్ర

శ్రీకాళహస్తి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో విజయనగర కాలం నాటి రాగిఫలక శాసనాలు వెలుగుచూశాయి. శ్రీకాళహస్తీశ్వరాలయంలో అనువంశిక గురుకుల్‌గా సేవలందిస్తున్న డాక్టర్ పరశురామ్ ఇంట ఇవి తరాలుగా ఉన్నాయి. కార్తీక మాసం సందర్భంగా వీటిని బయటకు తీసి శుద్ధి చేస్తుండగా, వీరి కుటుంబ పురోహితుడు సింగరాజు మణి ఫోటోలు తీసి, వాటిని మైసూరులోని భారత పురావస్తు శాఖ శాసన విభాగం డైరెక్టర్ మునిరత్నం రెడ్డికి పంపారు. ఆయన పరిశీలించి ఇవి క్రీ.శ. 1576లో విజయనగరరాజు శ్రీరంగరాయ శ్రీకాళహస్తీశ్వరాలయంలో కైంకర్యాలు, అన్నదానాలు నిర్వహించడం కోసం కొన్ని గ్రామాలను దానంగా ఇచ్చిన శాసనాలని నిర్ధారించారు. సంస్కృత భాషలో నందినాగరి లిపిలో రాగి రేకుల మీద వీటిని చెక్కి ఉన్నారు. వీటిని స్వయంగా పరిశీలించడం కోసం మునిరత్నం రెడ్డి శ్రీకాళహస్తికి రానున్నారు. నాలుగు రాగి ఫలకలు వీరి వద్ద ఉన్నాయి.

జాతీయస్థాయి పోటీలకు సుస్మిత



కణేకల్లు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): విజయవాడలో సోమవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో మండలంలోని హనకనహాళ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి సుస్మిత ప్రతిభచాటింది. త్వరలోనే రాజస్థాన్‌లో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు హెచ్ఎం వేణుగోపాల్, పీఈటీ సరిత బుధవారం తెలిపారు.

ఇంట్లోవాళ్లకు కోటి..!

పశుసంవర్ధక శాఖలో నిధుల స్వాహా..!

- కుటుంబ సభ్యుల ఖాతాలకు మళ్లించిన మునుపటి జేడీ
- వెలుగుచూసిన అక్రమం
- ప్రభుత్వ సొమ్మును భద్రంగా ఉంచాలనే మళ్లించినట్లు బుకాయింపు?
- రాష్ట్ర డైరెక్టర్ దృష్టికి వ్యవహారం
- నేడో.. రేపో.. రాష్ట్ర ఆడిట్ బృందం రాక

పశుసంవర్ధక శాఖలో గతంలో పనిచేసిన ఏకంగా రూ.కోటికిపైగా స్వాహా చేసినట్లు సమాచారం. అది కూడా కుటుంబికుల ఖాతాలకు జమ చేసినట్లు తెలుస్తోంది. వ్యవహారం ప్రస్తుతం బయటకు పొక్కడంతో ఆ అధికారి కట్టుకథ చెబుతున్నారట. అబ్బే.. తాను నిధులు కొట్టేసే ఉద్దేశంతో మళ్లించలేదనీ, ప్రభుత్వ ఖాతాలో ఉంటే భద్రత ఉండదనే.. కుటుంబికుల ఖాతాలకు జమ చేశానంటూ బుకాయిస్తున్నాడు. పాపం.. ప్రభుత్వ సొమ్ముపై ఎంత జాగ్రత్తో కదా..



సిబ్బందితో సమావేశమైన జేడీ ప్రేమ్‌చంద్

అనంతపురం అర్బన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధక శాఖలో భారీగా నిధుల స్వాహా జరిగింది. ఆది నుంచీ వివాదాస్పద అధికారిగా పేరొందిన గతంలో ఇక్కడ పనిచేసిన ఓ జేడీ నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు సమాచారం. వివిధ పథకాలకు సంబంధించిన డిపార్టుమెంట్ ఖాతాల్లోని సొమ్మును కొందరు సిబ్బందితో కుమ్మక్కై కాజేసినట్లు సమాచారం. ఇందులో ఎక్కువ మొత్తంలో జేడీస్థాయి అధికారి తన కుటుంబ సభ్యుల ఖాతాల్లోకి మళ్లించినట్లు సమాచారం. నిధుల స్వాహా విషయాన్ని రహస్యంగా ఉంచేందుకు సంబంధిత అధికారులు ప్రయత్నించారు. విషయం బయటకు పొక్కిన నేపథ్యంలో పశుసంవర్ధక శాఖ జేడీ ప్రేమ్‌చంద్ బుధవారం తన చాంబర్‌లో కార్యాలయ అధికారులు, సిబ్బందితో అత్యవసరంగా సమావేశమయ్యారు. నిధుల స్వాహాపై కూడా చర్చించినట్లు సమాచారం.

రూ.కోటికిపైగా స్వాహా

జిల్లా పశుసంవర్ధక శాఖకు సంబంధించిన నిధులను పలు బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తూ వస్తున్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వ పథకాల నిధులు ఖాతాల్లో మిగిలిపోయినట్లు సమాచారం. ఈ సొమ్ముపై వచ్చే వడ్డీని పలు అత్యవసర పనులకు వాడుకునే వెసులుబాటు ఉంటుంది. గతంలో ఇక్కడ జేడీగా పని చేసిన ఓ అధికారి డిపార్టుమెంట్ ఖాతాలోని నిధులపై కన్నేసినట్లు సమాచారం. ఆయన ఉద్యోగ విరమణ సమీపిస్తున్న తరుణంలో డిపార్టుమెంట్ ఖాతాలోని సొమ్మును తన కుటుంబ సభ్యుల ఖాతాల్లోకి రూ.కోటికిపైగా మళ్లించినట్లు సమాచారం. డిపార్టుమెంట్ ఖాతాలోని సొమ్మును వాడుకునే సమయంలో ఏ పనికి ఖర్చు చేస్తున్నారు...? తదితర వివరాలు నమోదు చేయాల్సి ఉంది. అవేమీ లేకుండానే భారీగా సొమ్మును ఆ అధికారి తన కుటుంబ సభ్యుల ఖాతాల్లోకి జమచేసినట్లు తెలుస్తోంది. సదరు జేడీకి పశుసంవర్ధక శాఖ జేడీ కార్యాలయంలోని ఓ సీనియర్ అసిస్టెంట్, మరికొందరు సిబ్బంది సహకరించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. డబ్బు కాజేసిన విషయం బయటపడే అవకాశం ఉందని గ్రహించిన సదరు సీనియర్ అసిస్టెంట్ సెలవుపై వెళ్లాడన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారం వెనుక ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉందన్న అంశం తేలాల్సి ఉంది.

కలకలం..

రూ.కోటికిపైగా నిధులు స్వాహా చేశారన్న సమాచారంతో పశుసంవర్ధక శాఖలో కలకలం రేగింది. ఎవరెవరి ఖాతాలకు సొమ్ము జమ చేశారు..? ఇందులో ఎవరెవరి ప్రమేయం ఉందన్న దానిపై అధికారులు ఆరాతీశారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఓ జేడీనే నిధులు స్వాహాకు పాల్పడ్డారని నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. సొమ్ము స్వాహా విషయం బయటకు పొక్కిన సమాచారం జేడీకి అనుకూలురైన సిబ్బంది చేరవేసినట్లు తెలిసింది. దీంతో సంస్థ డబ్బు ఎవరైనా కాజేస్తారన్న ఉద్దేశంతోనే కుటుంబ సభ్యుల ఖాతాల్లో భద్రంగా ఉంచాననీ.. ఇందులో తన తప్పేముందని ఆ అధికారి బుకాయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

నేడో.. రేపో.. ఆడిట్ బృందం రాక

నిధుల స్వాహాపై బ్యాంకు వివరాలతో సహా ఆ శాఖ రాష్ట్ర డైరెక్టర్‌కు పశుసంవర్ధక శాఖ అధికారులు నివేదించినట్లు సమాచారం. కలెక్టర్ ఆనంద్ కూడా ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా పరిగణించినట్లు తెలుస్తోంది. సంబంధిత అధికారులతో నిధుల స్వాహాపై ఆరాతీశారట. ఈ నేపథ్యంలో ఒకట్రెండు రోజుల్లో రాష్ట్ర ఆడిట్ బృందం జిల్లాకు రానున్నట్లు సమాచారం. నిధుల స్వాహాపై సమగ్ర విచారణ చేసి, రాష్ట్ర ఉన్నతాధికారులు, ప్రభుత్వానికి నివేదికలు సమర్పించనున్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఈ వ్యవహారంపై ఆ శాఖలో తీవ్ర చర్చ సాగుతోంది.

హామీలు విస్మరించడం అన్యాయం

- విద్యారంగ పరిరక్షణకు రాజీలేని పోరాటం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య
- అనంతలో ముగిసిన ఏఐఎస్ఎఫ్ బస్సుయాత్ర



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య

అనంతపురం విద్య, నవంబరు12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక, విస్మరించడం అన్యాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య మండిపడ్డారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యలపై చేపట్టిన రాష్ట్రవ్యాప్త బస్సుయాత్ర ముగింపు సభ బుధవారం అనంతలో నిర్వహించారు. నగరంలోని కేఎస్ఆర్ బాలికల కళాశాల వద్ద ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కుళ్లాయిస్వామి ఆధ్వర్యంలో పెద్దఎత్తున సభ నిర్వహించారు. కార్యక్రమానికి ఈశ్వరయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యారంగ పరిరక్షణకు రాజీలేని పోరాటం సాగిస్తామని తెలిపారు. పాలకులు సంస్కరణల పేరుతో విద్యారంగాన్ని వ్యాపారంగా మారుస్తూ నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. రూ.6,400కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి పెడుతున్నాయన్నారు. దీంతో విద్యార్థులు మానసికంగా నలిగిపోతున్నారన్నాని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు పేదోళ్ల విద్యారంగ సమస్యలు తెలియవా అని ప్రశ్నించారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణ సరికాదన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఏఐఎస్ఎఫ్ చేపట్టే ఉద్యమాలకు సీపీఐ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. విద్యా వ్యతిరేక విధానాలపై రాష్ట్రవ్యాప్త పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ నాయకులు జగదీష్, జాఫర్, ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పుట్టా లక్ష్మణ్, రాష్ట్ర అధ్యక్షుడు వలరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పాళ్యం నారాయణ స్వామి, మల్లికార్జున, రాజారెడ్డి, అల్లీపీరా, ఏఐఎస్ఎఫ్ నాయకులు చలపతి, మస్తాన్, ఫణీంద్ర, నాగభూషణం, రవికుమార్, సాయి, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

పనిచేసిన కంపెనీలకే కన్నం

- కాపర్ వైరు అపహరణ కేసుల ఛేదింపు
- నలుగురి అరెస్టు



స్వాధీనం చేసుకున్న కాపర్ వైరును చూపుతున్న డీఎస్పీ

నంబులపూలకుంట, నవంబరు12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపంలోని సోలార్ కంపెనీల్లో గతంలో పనిచేసిన వారే కాపర్ వైరు అపహరించినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. కాపర్ వైరు చోరీ కేసులను పోలీసులు ఛేదించారు. నలుగురిని అరెస్టు చేసి, రూ.32లక్షల విలువ చేసే కాపర్ వైరును స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉండగా.. ఒకరు ఆస్పత్రిలో ఉన్నట్లు డీఎస్పీ శివనారాయణ స్వామి తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో నిందితుల అరెస్టు వివరాలను ఆయన వెల్లడించారు. నంబులపూలకుంటకు చెందిన అలీ, బాబాఫకృద్దీన్, బాలాజీ, ఆవుల శివ, రవి, మండల కేంద్రం సమీపంలోని ఎన్ రెడ్డివారిపల్లికి చెందిన పెద్దముబారక్, చిన్నముబారక్ ముఠాగా ఏర్పడ్డారు. సోలార్ ప్లాంట్‌లో పలు సంస్థలకు చెందిన కాపర్ వైరును పలుమార్లు అపహరించారు. దానిని విక్రయించి, సొమ్ము చేసుకున్నారు. చోరీలపై ఆయా సంస్థల ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు గత ఆరు నెలల్లోనే ఆరు కేసులు నమోదయ్యాయి. రూ.32లక్షల విలువైన 62వేల మీటర్ల కాపర్ వైరును అపహరించారు. ఈ చోరీలను పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. సీఐ నాగేంద్ర, ఎస్ఐ వలీబాషా, కానిస్టేబుల్ నారాయణ స్వామి బృందంగా ఏర్పడి కాపుకాశారు. ఐయానా సోలార్ కంపెనీ సమీపంలోని హంద్రీనీవా కాలువ వద్ద కాపర్ వైరును అపహరిస్తుండగా.. పెద్ద ముబారక్, చిన్న ముబారక్, అలీ, బాబా ఫకృద్దీన్‌ను పట్టుకున్నారు. బాలాజీ, ఆవుల శివ పరారీలో ఉండగా.. రవి అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులంతా గతంలో సోలార్ కంపెనీల్లో గ్రాస్ కట్టింగ్ (గడ్డికోత), వెల్డర్, టెక్నీషియన్, వెల్డింగ్ పనులు చేసినవారేనన్నారు.

బిడ్డను చూడకుండానే..

తండ్రి కన్నుమూత

- ఆస్పత్రిలో కుమార్తె జననం
- చూసేందుకెళ్తూ రోడ్డు ప్రమాదంలో తండ్రి దుర్మరణం

బత్తలపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆస్పత్రిలో బిడ్డ జన్మించిందని తెలియగానే ఆనందంగా చూడడానికి బయల్దేరిన తండ్రి మార్గమధ్యలోనే దుర్మరణం చెందాడు. బిడ్డను చూడకుండానే కన్నుమూశాడు. మండలకేంద్రంలోని వైజంక్షన్‌లో బుధవారం రాత్రి బైక్ బోల్తాపడి ధర్మవరానికి చెందిన దిలీప్‌కుమార్ (25) మరణించాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ధర్మవరంలోని శాంతినగర్‌కు చెందిన నాగేంద్ర కుమారుడు దిలీప్‌కుమార్ పట్టు చీరలకు సంబంధించి రేషం వ్యాపారం చేస్తుండేవాడు. ఇతడికి భార్య లాస్య, కుమార్తె ఉన్నారు. అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రిలో లాస్య బుధవారం ప్రసవించింది. ఆడ శిశువుకు జన్మనిచ్చింది. బిడ్డను చూసేందుకు దిలీప్ కుమార్ ఆనందంగా బయల్దేరాడు. ధర్మవరం నుంచి బైక్‌పై బయల్దేరాడు. బత్తలపల్లి దాటగానే వైజంక్షన్ వద్ద బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. దీంతో తీవ్రంగా గాయపడిన దిలీప్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు.. ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. కుటుంబికులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని, బోరున విలపించారు. మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపురంరూరల్,నవంబరు12(ఆంధ్రజ్యోతి):అనంత వ్యవసాయ మార్కెట్లో బుధవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.18,500తో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.7వేలు, సరాసరి ధర రూ.15వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 19టన్నుల చీనీకాయలు వచ్చినట్లు చెప్పారు.

టమోటా కిలో రూ.33

అనంతపురం రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి):కక్కలపల్లి టమోటా మార్కెట్లో బుధవారం టమోటాలు కిలో గరిష్ఠంగా రూ.33తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. కనిష్ఠంగా రూ.13తో, సరసరిగా రూ.23తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 1800 టన్నుల టమోటాలు వచ్చినట్లు చెప్పారు.

కోర్టుకు హాజరైన టీడీపీ నాయకులు



కోర్టు వద్ద ప్రకాశ్ నాయుడు, నటుడు రాజ్‌కుమార్‌కు స్థానిక నాయకుల సత్కారం

గుత్తి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా నమోదైన కేసు విషయంగా పట్టణ కోర్టుకు టీడీపీ నాయకులు బుధవారం హాజరయ్యారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా 2009 ఏప్రిల్‌లో గుత్తి పట్టణంలో సినీ నటుడు రాజ్‌కుమార్, చంద్రదండు వ్యవస్థాపకుడు ప్రకాష్‌నాయుడు, టీడీపీ నాయకులు కృష్ణ, గాజుల ఆదెన్న ప్రచారం నిర్వహించారు. ఈక్రమంలో నిబంధనలు అతిక్రమించారని అప్పట్లో వారిపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. దీంతో వారు కోర్టుకు హాజరయ్యారు. వారి వెంట ఏజీపీ ఫకృబాష, సీనియర్ న్యాయవాది సోమశేఖర్, టీడీపీ నాయకులు, పాల్గొన్నారు.

వార్డెన్ల జేఏసీ ఏర్పాటు

అనంతపురం విద్య, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): సంక్షేమ శాఖల వార్డెన్ల సంఘాన్ని పదేళ్ల తరువాత పునరుద్ధరించారు. జిల్లా జేఏసీని ఏర్పాటు చేశారు. స్థానిక బీసీ స్టడీ సర్కిల్‌లో ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖల వార్డెన్లు బుధవారం సమావేశమయ్యారు. తమ సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారానికి భవిష్యత్తు కార్యాచరణను రూపొందించారు. జేఏసీ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రామునాయక్, ప్రధానకార్యదర్శిగా మారుతీప్రసాద్, అసోషియేట్ ప్రెసిడెంట్‌గా మస్తాన్, ఉపాధ్యక్షులుగా రాజశేఖరనాయుడు, నాగమణి, రామాంజనేయరెడ్డి, బయపరెడ్డి, గురుప్రసాద్, అశ్వత్థ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా చంద్రశేఖరబాబు, సంయుక్త కార్యదర్శులుగా సాహిజి, జగన్నాథ్, నాగరాజు, గోవిందరెడ్డి, ఈరన్న, ఆదినారాయణ, బాలు, సూర్యాంజనేయులును ఎన్నుకున్నారు.

వన్‌స్టాప్ సెంటర్‌లో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

అనంతపురం వైద్యం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లా మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని వన్‌స్టాప్ సెంటర్‌లో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఐసీడీఎస్ పీడీ అరుణకుమారి బుధవారం ప్రకటనలో తెలిపారు. ఒకటి చొప్పున సోషల్ కౌన్సిలర్, మల్టీపర్పస్ స్టాఫ్/కుక్, రెండు సెక్యూరిటీ గార్డ్/నైట్ గార్డ్ మొత్తం నాలుగు పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీచేయనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 15 నుంచి 25వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. వివరాలకు https://ananthapuramu.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

యువతి అదృశ్యం

యాడికి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కూర్మాజీపేట గ్రామానికి చెందిన ఓ యువతి ఈనెల 8 నుంచి కనిపించడం లేదు. బాధిత కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లల్లో గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో ఆ యువతి తండ్రి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వేతన కమిషన్‌ను నియమించాలి

రైల్వే గార్డుల డిమాండ్: డీఆర్ఎం కార్యాలయం ఎదుట ధర్నా



డీఆర్ఎం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైల్వే గార్డులు

గుంతకల్లు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం 8వ వేతన కమిషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని అఖిల భారత రైల్వే గార్డుల కౌన్సిల్ (ఏఐజీసీ) నాయకులు డిమాండ్ చేశారు. రైల్వే గార్డుల సమస్యలపై బుధవారం స్థానిక డీఆర్ఎం కార్యాలయం ఎదుట ఏఐజీసీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. సంఘం డివిజనల్ కార్యదర్శి పీకే సింగ్ మాట్లాడుతూ.. రైలు మేనేజర్లకు వేతన స్థాయిలను నిర్ధారించాలనీ, 2024 జనవరి 1వ తేదీ నుంచి రన్నింగ్ అలవెన్సును 25 శాతానికి పెంచాలనీ, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలనీ, ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైలు గార్డులు పాల్గొన్నారు.

జంబూద్వీప చక్రాన్ని పరిశీలించిన జేసీ



వివరాలు తెలుసుకుంటున్న జేసీ శివనారాయణశర్మ

వజ్రకరూరు(ఉరవకొండ), నవంబరు12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొనకొండ్ల సమీపంలో ఉన్న జంబూద్వీప చక్రాన్ని జేసీ శివనారాయణశర్మ బుధవారం పరిశీలించారు. కొనకొండ్ల వద్ద ఆర్కియాలజీకి సంబంధించి ప్రతిపాదించిన అదనపు భూమి కోసం కొండ వద్ద ఉన్న స్థలాన్ని పరిశీలించారు. పురావస్తు శాఖకు 25ఎకరాలు కేటాయించగా, రోడ్ల నిర్మాణం కోసం 2.6 ఎకరాల స్థలం అదనంగా అవసరమైంది. అందుకు సంబంధించిన రికార్డుల వివరాలను జేసీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దారు నరేష్, ఆర్కియాలజీ ఏడీ స్వామి నాయక్, వీఆర్వోలు, శత్రనాయక్, నవ్య పాల్గొన్నారు.

నేటి నుంచి సంగీత కార్యక్రమాలు

పుట్టపర్తి, నవంబరు12(ఆంధ్రజ్యోతి): ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంత్ సభా మండపంలో గురువారం నుంచి 17వరకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మొదటిరోజు అనిల్‌బాన్‌రామ్ ఫ్లూట్ వాయిద్యం, హయ్యర్ సెకండరీ స్కూల్ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, 14న కుమారి రూప సితార్ వాయిద్యం, 15న విదేశీ భక్తుల సంగీత సాంస్కృతిక కార్యక్రమాలు, 16న ఔజాద్ అలీ ఖాన్ బృందం వాయిద్యకచేరి, 17న పండిట్ విస్వాత మోహన్ బట్టు బృందం వీణ వాయిద్యం కార్యక్రమాలు నిర్వహించనున్నారు.




ప్రశాంతి నిలయం గణేష్ గేటు వద్ద బాబా చిత్రపటానికి ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

రాబర్ట్ లూయిస్ స్టీవెన్సన్ (జయంతి)



రాబర్ట్ లూయిస్ స్టీవెన్సన్ 1850 నవంబరు 13న యూకే లోని ఈడిన్‌బర్గ్‌లో జన్మించారు. స్కాటిష్ నవలారచయితగా, కవిగా, ట్రావెల్ రైటర్‌గా పేరొందారు. ట్రెజర్ ఐల్యాండ్, కిడ్నాప్డ్, స్ట్రేంజ్ కేస్ ఆఫ్ డాక్టర్ జెక్లీ అండ్ మిస్టర్ హైడ్ వంటి రచనలు ప్రజాదరణ పొందాయి. 1894 డిసెంబరు 3న కన్నుమూశారు. 1994లో వందో వర్ధంతి సందర్భంగా రాయల్‌బ్యాంక్ ఆఫ్ స్కాట్లాండ్ ఒక ప్రత్యేక నోటును విడుదల చేసింది. 2018లో 26వ మోస్ట్ ట్రాన్స్‌లేటెడ్ ఆథర్ ఇన్ ది వరల్డ్ గుర్తింపు పొందారు.

పురిపండ అప్పలస్వామి (జయంతి)



ప్రముఖ సాహితీవేత్త పురిపండ అప్పలస్వామి 1904 నవంబరు 13న విజయనగరంలో జన్మించారు. బహుభాషావేత్తగా, రచయితగా, అనువాదకుడిగా, జర్నలిస్ట్‌గా, ఎడిటర్‌గా రాణించారు. స్వాతంత్ర్య పోరాటంలోనూ, సహాయ నిరాకరణ ఉద్యమంలోనూ కీలక పాత్రను పోషించారు. హరిజనోద్ధరణ, ఖాదీ ఉద్యమాల్లోనూ చురుగ్గా పాల్గొన్నారు. 'స్వశక్తి' అనే పత్రికకు సంపాదకుడిగా పని చేశారు. 12 సంవత్సరాల పాటు ఆంధ్రపత్రికకు స్వాతంత్ర్యపోరాటాల వ్యాసాలు రాశారు. వికాస రచయిత సంఘం అధ్యక్షునిగా సేవలందించారు. పలు లైబ్రరీలను అభివృద్ధి చేశారు. సాహితీసేవలకు 1973లో ఆంధ్రా విశ్వవిద్యాలయం నుంచి 'కళాప్రపూర్ణ' పురస్కారాన్ని అందుకున్నారు. 1982 నవంబరు 18న కన్నుమూశారు. విశాఖపట్నంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

అభినవ విద్యాతీర్థ మహాస్వామి (జయంతి)




శృంగేరి శారదా పీఠానికి 35వ పీఠాధిపతిగా వ్యవహరించిన జగద్గురు అభినవ విద్యాతీర్థ మహాస్వామి 1917 నవంబరు 13న బెంగళూరు నగరంలో జన్మించారు. అసలు పేరు శ్రీనివాస శాస్త్రి. శృంగేరి పీఠాధిపతి చంద్రశేఖర భారతి-3 స్వామిజీ ఆయనకు 14వ ఏట సన్యాస దీక్షను ఇప్పించారు. 20ఏళ్లకు వేదాలలోనూ, యోగాలోనూ పరిపూర్ణ జ్ఞానాన్ని పొందారు. ఆయన హయాంలోనే తుంగా నదిపై శృంగేరి వద్ద వంతెన నిర్మాణం జరిగింది. విద్యాతీర్థ ఫౌండేషన్ ద్వారా స్కాలర్ షిప్‌లను అందజేసి ప్రోత్సహించారు. 1989 సెప్టెంబరు 21న పరమపదించారు.

టీ సూర్యకుమారి (జయంతి)



అలనాటి తెలుగు సినీ నటి, ప్రసిద్ధ గాయకురాలు టంగుటూరి సూర్యకుమారి ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రిలో 1925 నవంబరు 13న జన్మించారు. 1952లో ఆమె తొలి 'మద్రాసు అందాల సుందరి'గా ఎంపికయ్యారు. బాల్యంనుంచే పాటలపై ఆసక్తితో రాణించారు. తెలుగు, కన్నడ, తమిళం, హిందీ ఇలా నాలుగు భాషల్లోనూ పాటలు పాడటమే కాకుండా 26 సినిమాల్లోనూ నటించారు. సుమారు 100 గ్రామ్‌ఫోన్ రికార్డుల్లో పాటలు పాడారు. అమెరికాలో బ్రాడ్వే అవార్డు పొందిన తొలి భారతీయ గాయనిగా పేరొందారు. అమెరికా, స్వీడన్, హాలండ్ తదితర దేశాలలో భారతీయ సంగీత శిక్షణాలయాలు నెలకొల్పి వందలాది కళాకారులను తీర్చిదిద్దారు. ప్రపంచ తెలుగు మహాసభ ఆమెను రాజ్యలక్ష్మి పురస్కారంతో సత్కరించింది. 2005 ఏప్రిల్ 25న కన్నుమూశారు.

కాళోజీ నారాయణరావు (వర్ధంతి)



తెలంగాణ ప్రజల ప్రతి ఉద్యమ ప్రతిధ్వనిగా పేరొందిన కాళోజీ నారాయణరావు 1914 సెప్టెంబరు 9న కర్ణాటక రాష్ట్రం బిజాపూర్ జిల్లా రట్టిహళ్ళి గ్రామంలో జన్మించారు. మరాఠీ, తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో పండితులు. రాజకీయ, సాంఘిక చైతన్యాల సమాహారం. నిజాంల నిరంకుశత్వానికి, అరాచక పాలనకు వ్యతిరేకంగా కాళోజీ తన కలాన్ని సంధించి ఎన్నో రచనలు చేశారు. స్వాతంత్ర్య ఉద్యమ సేవలకు 'పద్మవిభూషణ్' అందుకున్నారు. వరంగల్‌లోని విశ్వ విద్యాలయానికి ఆయన పేరు పెట్టారు. ఆంధ్రసారస్వత పరిషత్ అనే సంస్థను ఏర్పాటు చేసి సాహితీ సేవలను అందించారు. 2002 నవంబరు 13న కన్నుమూశారు.

పీ సుశీల (పుట్టినరోజు)



నేపథ్యగాయని పులపాక సుశీల 1935 నవంబరు 13న విజయనగరంలో జన్మించారు. దక్షిణాదిన సినీ సంగీత రంగంలో ఆరు దశాబ్దాలలో 50వేలకుపైగా పాటలు పాడారు. వివిధ భాషలలో లెక్కలేనన్ని పాటలు పాడి గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు పొందారు. ఉత్తమ గాయనిగా ఐదు జాతీయ అవార్డులు, గానకోకిల, గాన సరస్వతి, కళైమామణితోపాటు అత్యున్నత 'పద్మభూషణ్' పురస్కారాలు అందుకున్నారు.

తాళూరు ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీ

సిరుగుప్ప, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లా మలేరియా వైద్యనిపుణులు డాక్టర్ అబ్దుల్లా తాళూరు ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బంది పనితీరును ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ గర్భిణుల ఆరోగ్యంపై దృష్టిసారించాలన్నారు. మందుల వాడకంపై మహిళలకు స్పష్టంగా వివరించారు. మలేరియా, డెంగీ వ్యాధులపై అప్రమత్తంగా వుండాలని ఆయన సూచించారు. తాళూరు ప్రభుత్వాస్పత్రి వైద్యులు ప్రశాంత్, సునీల్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



మహిళలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అబ్దుల్లా

ఓటు చౌర్యంపై కాంగ్రెస్ సంతకాల సేకరణ

బాగేపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పిలుపు మేరకు ఓటుచౌర్యంపై సంతకాల సేకరణ చేపట్టారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బ్లాక్‌కాంగ్రెస్ అధ్వర్యంలో బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఓటుచౌర్యంపై సంతకాల సేకరణలో భాగంగా ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి సంతకం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వస్తే విదేశాలలోని నల్లధనం తెస్తానని, ప్రజలందరి ఖాతాలలోకి రూ.15లక్షలు వేస్తామని, 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ఇచ్చిన హామీలు ఇంతవరకు అమలు కాలేదన్నారు. ప్రైవేటీకరణ, కాషాయీకరణ బీజేపీ సాధనలన్నారు. కులమతాల మధ్య సౌహార్ద్రతకు భంగం కలిగేలా వ్యవహరిస్తున్నారన్నారు. ఎన్నికలవేళ బాంబు దాడులతో ప్రజలలో భయాందోళనలు కలుగుతున్నాయన్నారు. ఏదో ఓట్లు ఎక్కువరావడంతో బీజేపీ అధికారంలోకి వచ్చింది మినహా ప్రజల సంపూర్ణమద్దతు లేదన్నారు. బ్లాక్ కాంగ్రెస్ సమితి అధ్యక్షుడు హెచ్ఎస్ నరేంద్ర మాట్లాడుతూ ఓటు ద్వారా బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో పురసభ అధ్యక్షుడు శ్రీనివాస్, కేడీపీ సభ్యుడు మంజునాథరెడ్డి, దరఖాస్తు సమితి సభ్యుడు లక్ష్మీనరసింహప్ప తదితరులు పాల్గొన్నారు.



సంతకం చేస్తున్న ఎమ్మెల్యే సుబ్బారెడ్డి

చెట్ల కొమ్మల నరికివేత

» ఏపీఎంసీ కార్యదర్శిపై ఎఫ్ఐఆర్



చెట్లకొమ్మలను ట్రాక్టర్‌లో తరలిస్తున్న వైనం

బంగారపేట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏపీఎంసీ మార్కెట్ ప్రాంగణంలో చెట్లకొమ్మలను అక్రమంగా నరికివేయడం వివాదానికి కారణమైంది. ఈమేరకు మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్, చెట్లు నరికివేసిన వట్రకుంటె గ్రామానికి చెందిన బాబులపై అటవీశాఖ అధికారులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మార్కెట్ ప్రాంగణంలో పెరిగిన భారీ చెట్ల కొమ్మలను తొలగించారు. మూడు నాలుగు లోడ్‌ల మేర ట్రాక్టర్లలో తొలగించారు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారి ప్రకాశ్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. చెట్లకొమ్మలను తరలిస్తున్న ట్రాక్టర్‌లను గుర్తించి కూడా వదిలివేయడం పలు అనుమానాలకు దారితీసింది. ఘటనపై కోర్టుకు నివేదిక సమర్పించిన అనంతరం కోర్టు ఆదేశాలమేరకు అటవీశాఖ అధికారి శ్రీలక్ష్మి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వివరాలిలా...

బంగారపేట పట్టణం కోలారు రోడ్డుకు అనుబంధంగా ఏపీఎంసీ మార్కెట్ ప్రాంగణంలోని భవనాలకు అడ్డంకిగా చెట్లకొమ్మలు ఉన్నాయనే కారణంతో భారీగా కొమ్మలను నరికివేశారు. ప్రభుత్వ సంస్థల పరిధిలోని ఏపీఎంసీ మార్కెట్‌లో అక్రమంగా చెట్లకొమ్మలతోపాటు రోడ్డుకు ఇరువైపులా ఉన్న కొన్ని చెట్ల కొమ్మలను నరికి తొలగించడంపై విమర్శలు వచ్చాయి. దీనిపై ఏపీఎంసీ కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ వేళ్లతోసహా చెట్లను తొలగించాలంటే అటవీశాఖ అనుమతి పొందాల్సి ఉంటుందన్నారు. నిర్మాణాలకు అడ్డంకిగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించేందుకు అనుమతులు అవసరం లేదన్నారు. దీనిపై ఏపీఎంసీ పాలనాధికారి రవీంద్ర స్పందిస్తూ మార్కెట్ ప్రాంగణంలో చెట్లకొమ్మలు తొలగించిన విషయం తన దృష్టికి వచ్చిందని ఈమేరకు కార్యదర్శికి నోటీసులు ఇచ్చామన్నారు. నోటీసుకు వివరణ వచ్చాక ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామన్నారు.

బాస్కెట్‌బాల్ క్రీడాకారులకు ప్రత్యేక కేంద్రం

బొమ్మనహళ్ళి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బీఎఫ్ఐ) ఆధ్వర్యంలో సర్జాపుర రోడ్డులో ఆధునాతన సౌకర్యాలతో స్పోర్ట్స్ సెంటర్ ఏర్పాటైంది. బాస్కెట్‌బాల్ హై పెర్ఫార్మన్స్ సెంటర్‌ను అత్యాధునిక సౌకర్యాలతో రూపొందించారు. విదేశాలకు చెందిన కోచ్‌లతో ఇక్కడ తర్ఫీదు ఇస్తున్నారు. 2026 పోటీలు లక్ష్యంగా క్రీడాకారులను తీర్చిదిద్దుతున్నారు. బుధవారం ఏర్పాటైన సమావేశంలో బాస్కెట్‌బాల్‌కు ఆదరణ పెరుగుతున్న తరుణంలో సెంటర్‌ను ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు ప్రకటించారు. లక్ష్యన్ అకాడమీ సహకారంతో క్రీడాకారులకు అవసరమైన సదుపాయాలు కల్పించినట్టు పేర్కొన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో జిమ్, స్విమ్మింగ్‌పూల్, బ్యాడ్మింటన్ ఇతరత్రా ఉన్నాయన్నారు. ఇక్కడ కోచింగ్ పొందినవారు జాతీయస్థాయిలో రాణించారన్నారు. ఈ కేంద్రం రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందిందన్నారు.



క్రీడాకారులతో నిర్వాహక బృందం

మళమాచనహళ్ళిలో గదగ్ జిల్లా బృందం



పంచాయతీ కేంద్రం వద్ద అధ్యయన బృందం

శిడ్లఘట్ట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని మళమాచనహళ్ళి గ్రామపంచాయతీని గదగ్ జిల్లా నుంచి పరస్పర కలికా అధ్యయనంకై బృందం సందర్శించింది. గ్రామపంచాయతీ అధ్యక్షులు, స్థాయిసమితి అధ్యక్షులు, సభ్యులు, పీడీఓ, కార్యదర్శి సహా 30మందికిపైగా బృందాన్ని సందర్శించారు. తొలుత గ్రామపంచాయతీ పరిధిలోని చిక్కదాసరహళ్ళిలోని పురాణ ప్రసిద్ధ బ్యాటరాయస్వామి దేవాలయం, పుష్కరిణిని పరిశీలించారు. అనంతరం మళమాచనహళ్ళిలోని మాదిరి అంగన్‌వాడీ కేంద్రాన్ని, సంజీవిని భవనాన్ని, గ్రామ పంచాయతీ గ్రంథాలయం, గ్రామపంచాయతీ భవనాన్ని పరిశీలించి ఉత్తమంగా ఉన్నాయని ప్రశంసించారు. గ్రామపంచాయతీ పీడీఓ శైల మార్గదర్శకంలో అభివృద్ధి గురించి సమాచారం అందుకున్నారు. గదగ్ జిల్లానుంచి వచ్చిన బృందాన్ని గ్రామస్థులు ఆత్మీయంగా సత్కరించారు.

ట్రాఫిక్ జామ్‌తో వాహనదారుల పాట్లు

తోరణగల్లు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): బళ్లారి నుంచి హొస్పేట వయా తోరణగల్లు మీద ప్రయాణించాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడు చూసినా ట్రాఫిక్ జామ్ అవుతోంది. తోరణగల్లు స్టేషన్ సమీపంలో ఉన్న బ్రిడ్జి వెడల్పు లేకపోవడం సమస్యగా మారింది. దీనికి తోడు గుంతలు ఏర్పడడం అక్కడ ఒక చిన్న వాహనం ఇబ్బందికిలోనైనా అటు హొస్పేట నుంచి సండూరు వైపు వాహనాలు నిలిచిపోతున్నాయి. కొన్నిసార్లు అంబులెన్స్ కూడా మధ్యలో ఇరుక్కుపోవడం సర్వసాధారణంగా మారింది. తోరణగల్లు చుట్టుపక్కల ప్రాంతాల రోడ్లు గుంతలమయంగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ట్రాఫిక్ జామ్‌లతో ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. పోలీసువారు ట్రాఫిక్ జామ్ లేకుండా ప్రయత్నాలు చేస్తున్నా ప్రయోజనం లేకుండాపోతోంది. వాహనాలు ఎక్కువగా వుండటం ముఖ్యంగా పారిశ్రామిక ప్రాంతం కావడంతో భారీ నుంచి అతి భారీ వాహనాలు ఇతర కొన్ని వందల వాహనాలు ఈ ప్రాంతాల్లో ప్రయాణిస్తున్నాయి. ట్రాఫిక్ జామ్ కాకుండా చూడాలని సంబంధిత అధికారులను వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.



తోరణగల్లులో ట్రాఫిక్ జామ్

ఉద్యోగులు ఒత్తిడిని జయించాలి

● సిటీ ఎమ్మెల్యే డాక్టర్ శివరాజ్ పాటిల్

రాయచూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఒత్తిడిని ఎదుర్కొంటున్న ప్రభుత్వ ఉద్యోగులు వాటిని నివారించేందుకు తమ శక్తియుక్తులను వినియోగించాలని సిటీ ఎమ్మెల్యే డాక్టర్ శివరాజ్ పాటిల్ సూచించారు. మంగళవారం సాయంత్రం నగరంలోని వ్యవసాయ విశ్వ విద్యాలయ ఆవరణలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం షడాక్షరి అభినందన సభ, జిల్లా తొలి సాధారణ సభకు ముఖ్య అతిథిగా హాజరై ఎమ్మెల్యే మాట్లాడారు. రాజ్యాంగంలోని శాసన న్యాయ వ్యవస్థలతో పోలిస్తే కార్యనిర్వాహక వ్యవస్థ అనునిత్యం ఒత్తిడిలోనే కొనసాగుతున్నట్లు తెలిపారు. ఒకవైపు అధికార పార్టీ ప్రభుత్వ పరంగా ఒత్తిడి మరోవైపు ప్రతిపక్షం నుంచి వచ్చే ఒత్తిడితో పాటు ప్రజల నుంచి ఏదో ఒక రూపంలో ఒత్తిడి పెరిగిపోతుండడం సర్వసాధారణంగా మారిందన్నారు. ఈ స్థితిలో అందరినీ మెప్పించేందుకు ఉద్యోగులు చేస్తున్న కసరత్తు వారిని మానసిక ఒత్తిడికి గురిచేసేదిగా మారిందని, ఈ స్థితి నుంచి మనం బయట పడాల్సి ఉందన్నారు.



కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న శివరాజ్ పాటిల్

పరిశ్రమల స్థాపనపై మహిళలకు శిక్షణ



మహిళకు ధ్రువీకరణ పత్రం అందిస్తున్న అధికారులు

తోరణగల్లు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పరిశ్రమల స్థాపనపై సామర్థ్య భవనంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మహిళలకు ప్రమాణపత్రాలు అందించారు. కార్యనిర్వాహకాధికారి మడిగిన బసప్ప మాట్లాడుతూ.. మహిళలు పారిశ్రామిక స్థాపనలతో పాటు ఇతరులకు ఈ రంగంలో అవగాహన కల్పించి వారిని కూడా అభివృద్ధి పథంలో నడిపించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ప్రయోజన కార్యక్రమాలు ప్రజలకు వివరించాలన్నారు. తాలుకా పంచాయతీ సహాయ నిర్దేశకులు మహేష్ కుమార్ జిల్లా సంయోజకులు మర్రిస్వామి, ఇతర అధికారులు సోమశేఖర్, ట్రైనర్ వినోద్ కుమార్, కొట్రేష్, మంజుళ, అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

రైలు కిందపడి యువకుడి మృతి

సోమందేపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామ సమీపంలోని రైల్వేగేటువద్ద అదే గ్రామానికి చెందిన చాకలిబాబు(25) రైలుకింద పడి మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు. ఆత్మహత్య చేసుకున్నాడా లేక ప్రమాదవశాత్తు మృతిచెందాడా అనే కోణంలో రైల్వే పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆదినారాయణ, యల్లమ్మ కుమారుడు చాకలిబాబు సోమందేపల్లిలోని ఓ సిల్క్‌హౌస్‌లో పనిచేస్తున్నాడు. ఇటీవల నిర్మించిన నూతన గృహానికి సంబంధించి కొంత ఆర్థిక ఇబ్బందులు ఉన్న నేపథ్యంలో బాబు కియా అనుబంధ పరిశ్రమలో పనికి వెళ్లడానికి కుటుంబ సభ్యులను అడిగాడు. వారు మందలించగా మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని గ్రామస్థులు తెలిపారు. వాస్తవాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

వేధింపులు భరించలేక ఆత్మహత్యాయత్నం

పెనుకొండ టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అత్త, భర్త వేధింపులు తాళలేక వివాహిత హారిక ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. కడపజిల్లా మైదుకూరు నియోజకవర్గం దువ్వూరు గ్రామానికి చెందిన కృష్ణయ్య కుమారుడు రాజేష్‌తో హారికకు ఏడు నెలల క్రితం వివాహం జరిగింది. కొన్ని నెలలు అన్యోన్యంగా ఉన్నారు. అనంతరం భర్త, అత్త వేధింపులు మొదలయ్యాయి. బంగారమంతా లాక్కుని ఇంటి నుంచి బయటికి తరిమేశారు. ఈ క్రమంలో పెనుకొండ పోలీస్‌స్టేషన్‌లో పలుమార్లు పంచాయతీ చేశారు. అంతటితో ఆగకుండా భర్తకు వేరేపెళ్లి చేయాలనే ఉద్దేశ్యంతో అత్తింటి వేధింపులు చేస్తున్నారని ఈ క్రమంలోనే బుధవారం నిద్రమాత్రలు మింగింది. అపస్మారక స్థితిలో పడిఉన్న హారికను పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పారిశ్రామిక నిపుణులతో సమావేశం

బెంగళూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అజ్మాన్ న్యూ వెంచర్స్ సెంటర్ ఫ్రీజోన్ (ఏఎన్‌సీఎఫ్‌జడ్) తొలిసారి దేశంలోకి వచ్చామని బెంగళూరుతోపాటు పలు నగరాలలో పరిశ్రమలస్థాపనతో వార్షికోత్సవం జరపదలిచినట్టు ఏఎన్‌సీఎఫ్‌జడ్ చైర్మన్ షేక్ మహ్మద్ తెలిపారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన ఉన్నతస్థాయి బృందం బుధవారం బెంగళూరులో విభిన్నరంగాల పారిశ్రామిక నిపుణులతో సమావేశమైంది. 2024 అక్టోబరులో అజ్మాన్ న్యూ వెంచర్స్ ప్రారంభమైందని, ఏడాదిలోనే 6,500కుపైగా కంపెనీలు రిజిస్టర్ చేసినట్టు ఇది అతిపెద్ద మైలురాయి సాధించినట్టుగా ప్రకటించారు. ఫ్రీజోన్ ఒక నాన్‌స్టాప్ డిజిటల్ పోర్టల్ ద్వారా పనిచేస్తుందన్నారు. పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా 24 గంటలలో వీసా ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. సంస్థ సీఈఓ రిషి సోమయ్య మాట్లాడుతూ.. సరళీకృత సాంకేతిక పరిశ్రమలకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. 2022 నుంచి ఫెడరల్ కాంపిటిటీవ్‌నెస్ అండ్ స్టాటిస్టిక్స్ సెంటర్‌ను ఫ్రీజోన్‌లకు విదేశీ పెట్టుబడుల సాధనకు కృషి చేస్తున్నామన్నారు. అజ్మాన్ దుబాయ్ నుంచి 12కిలోమీటర్లు, అబుదబి నుంచి 180 కిలోమీటర్ల దూరంలో ఉందన్నారు. పరిశ్రమల ప్రగతికోసం విదేశీ పెట్టుబడుల సాధన లక్ష్యంగా పనిచేస్తున్నట్టు వారు ప్రకటించారు. బెంగళూరుతోపాటు దేశంలోని పలు నగరాలను సందర్శిస్తామన్నారు. ప్రపంచబ్యాంకు ప్రకారం చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు 90శాతం వ్యవహారాలు గ్లోబల్‌స్థాయిలో సగంకంటే ఎక్కువ ఉద్యోగాలు సాధ్యం కానున్నాయన్నారు.

రెండేళ్లలో 50శాతం సేవల విస్తరణ

బెంగళూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేధస్సుకు అనుగుణంగా రానున్న రెండేళ్లలో సేల్స్‌ఫోర్స్ సేవలను 50శాతం విస్తరింపదలిచామని సంస్థ ఎండీ మాన్‌కిరణ్ చౌహాన్ తెలిపారు. బుధవారం సేల్స్‌ఫోర్స్ కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజిమెంట్ (సీఆర్‌ఎం) ఏడో సంవత్సరంలోనే 30శాతానికి విస్తరించిందన్నారు. వినియోగదారుడికి వేగవంతంగాను నమ్మకం పెంచేలాంటి సేవలు అమలు చేయదలిచామన్నారు. దేశంలో ఏఐ ఏజెంట్‌లు 69శాతం, నాన్ ఏజెంట్‌లు 12శాతం పాజిటివ్ అవుట్‌లుక్‌తో పనిచేస్తున్నారన్నారు. 90శాతం మంది సర్వీస్ పొందేవారు చాలెంజ్‌లను స్వీకరించడంలో సులభతరాన్ని కోరుతారన్నారు. పోర్టర్ ఇంజనీరింగ్ వైస్ ప్రెసిడెంట్ శుభంగుప్త మాట్లాడుతూ ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకు 6,500మంది సర్వీస్ ఎక్స్‌పర్ట్స్ రెండు సర్వేల ద్వారా డేటా పొందారన్నారు. రానున్న రెండేళ్ల సేల్స్‌ఫోర్స్ డేటా, ఆధునికత ఆవిష్కరణల విషయంలో ముందంజలోకి తీసుకురావాలన్నది ఆశయమన్నారు.

బెంగళూరు ఉత్తర వర్సిటీ నామినేటెడ్ సభ్యుడిగా మునిస్వామి గౌడ

ముళబాగిలు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): బెంగళూరు ఉత్తర విశ్వవిద్యాలయం అకడమిక్ కౌన్సిల్ నామినేటెడ్ సభ్యుడిగా తాలూకాలోని సిద్దఘట్ట గ్రామానికి చెందిన ఎస్ఎం మునిస్వామిగౌడ నియమితులయ్యారు. ఆయన స్వాతంత్ర్యపోరాటనేత, దివంగత వీ మునిస్వామిగౌడ కుమారుడు. ఈమేరకు ఉన్నతవిద్యాశాఖ అండర్ సెక్రటరీ సీ శశికళ ఆదేశాలు జారీ చేశారు. సీఎం, డీసీఎంల సిఫారసుతో ఆయనకు అవకాశం లభించింది. సిద్దఘట్ట మునిస్వామిగౌడ ముళబాగిలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ, బెంగళూరు యూనివర్సిటీలో ఎంఏ ఎకనామిక్స్, బెంగళూరు వీవీపురంలోని లా కళాశాలలో ఎల్ఎల్‌బీ చదివారు. మునిస్వామిగౌడను బుధవారం పలువురు అభినందించారు.



సిద్దఘట్ట మునిస్వామిగౌడ

అన్న సువిధ పథకం ప్రారంభం



రేషన్‌ను ఇంటి వద్దే అందిస్తున్న ఆహార పౌరసరఫరాల శాఖ అధికారులు

రాయచూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 75 ఏళ్లు పైబడిన ఒంటరి రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం కొత్త పథకాన్ని ప్రారంభించనుంది. అన్న సువిధ పథకం పేరుతో ప్రారంభమైన ఈ పథకం ద్వారా ఒంటరి వినియోగదారులుగా ఉన్న రేషన్ కార్డుదారులకు వారి ఇంటి వద్దనే రేషన్ అందజేయనున్నారు. ఇందుకు సంబంధించి 6వ తేదీ నుంచి కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఆహార పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపారు. 2025-26వ బడ్జెట్‌లో ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రకటించిన మేరకు అన్న సువిధ పథకం ద్వారా ఒంటరి కార్డుదారుల రేషన్‌ను వారి ఇంటి వద్దే అందించే ఏర్పాటు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 2,59,154 మంది ఉన్నట్లు గుర్తించిన అధికారులు రాయచూరు జిల్లాలో వీరి సంఖ్య 4,289గా ఉన్నట్లు తేల్చారు. కార్డుదారులు ప్రతినెలా 1 నుంచి 5వ తేదీలోగా తమకు సంబంధించిన సమాచారాన్ని ఇండెంట్‌ను మొబైల్ యాప్‌లో అందించాల్సి ఉంటుంది.

ఘనంగా ఒణికే ఓబవ్వ జయంతి



ఒణికే ఓబవ్వ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

సిరుగుప్ప, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఒణికే ఓబవ్వ చరిత్ర ఎంతో వుందని బీజేపీ సీనియర్ నాయకులు ఉడేగోళ ఖాజాసాబ్ అన్నారు. సిరుగుప్ప పట్టణం బీజేపీ కార్యాలయంలో ఒణికే ఓబవ్వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆమె భావచిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశం కోసం బ్రిటీషువారికి వ్యతిరేకంగా పోరాటం చేశారని గుర్తు చేశారు. తాలుకా ప్రధాన కార్యదర్శి బెళగల్ బసవరాజ, దేవ, శంకర, సర్దార్ పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1625.08	1631.66
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	2,812	5.017
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	7,220	10,084
నీటి నిల్వ (టీఎంసీలు)	76.75	100.45



హంపిలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

భక్తిశ్రద్ధలతో కార్తీక మాస పూజలు

కంప్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): తాలుకా పరిధిలోని బుక్కసాగర గ్రామం వద్ద ఏడుపడగల నాగప్ప ఆలయం వద్ద బుధవారం కార్తీక దీపోత్సవం చేపట్టారు. పూజా కార్యక్రమంలో దేవదాయ శాఖ అధికారి హనుమంతప్ప పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకుముందు పురోహితుడు విశ్వనాథ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. హంపిలో కూడా కార్తీక మాసం సందర్భంగా శివాలయంలో పూజలు నిర్వహించారు. కార్తీక జ్యోతులు వెలిగిస్తూ మహిళలు మొక్కులు చెల్లించుకున్నారు.

రోడ్డు అభివృద్ధికి నడుం బిగించిన రైతులు



రోడ్డు పనులు చేపడుతున్న రైతులు

కంప్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): తాలుకాలోని దేవసముద్రం గ్రామ శివార్లలోని చిక్కజయగనూరు మాగాణి రహదారి అధ్వానంగా మారింది. రేపో మాపో వరి పంటలు కోతకు రానున్నాయి. రేపు వరిధాన్యం పొలం నుంచి గట్టుకు చేర్చేందుకు కష్టంగా మారిందని నాయకులు పట్టించుకోకపోవడంతో రైతులు తమ సొంత ఖర్చులతో 3 కి.మీ రహదారిని మరమ్మతు చేసేందుకు నడుంబిగించారు. రైతు వీరేష్ మంజునాథ మాట్లాడుతూ కొన్ని రోజులుగా పొలానికి వెళ్లేందుకు రోడ్డు ఇబ్బందిగా వుండటం వల్ల రైతులే ముందుకు వచ్చి రోడ్డును సిద్ధం చేసేందుకు ముందుకు వచ్చారని తెలిపారు. చిన్ననీటి పారుదల అధికారులు రైతుల కష్టాలను దృష్టిలో వుంచుకుని రోడ్డును ఏర్పాటు చేయాలని కోరారు. శీనయ్య, తిమ్మప్ప, నీలకంఠప్ప, శివప్ప, ఖాసీంసాబు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బళ్లారి గాంధీనగర్, నవంరు 12(ఆంధ్రజ్యోతి): నగరంలో జెస్కాం ఉప విభాగం-2 పరిధిలోకి వచ్చే జిల్లా కోర్టులో విద్యుత్ లైన్ నిర్వహణ పనులు చేపడుతున్న కారణంగా గురువారం ఉదయం 9 నుంచి 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జెస్కాం ఏఈఈ ఒక ప్రకటనలో తెలిపారు. ఫీడర్ నంబరు 6 పరిధిలోకి వచ్చే తాళ్ళూరు రోడ్డు, స్నేహ కాలనీ, శ్రీనగర్, రేణుకా నగర్, భగత్ సింగ్ నగర్, కన్నడ నగర్, మహానంది కొట్టం, పార్వతి నగర్, ఎస్పీ సర్కిల్, శాస్త్రి నగర్, బ్యాంక్ కాలనీ, బసవన కుంట, సిరుగుప్ప, రామనగర్, జిల్లా కోర్టుతో వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ఇందుకు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సౌకర్యాలు కల్పించండి

బళ్లారి సిటీ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలో నేటి నుంచి 19వ తేదీ వరకు భారత సైన్యం నిర్వహిస్తున్న అగ్నివీర్ నియామకాల్లో భాగంగా వచ్చే అభ్యర్థుల కోసం మౌలిక సదుపాయాలు కల్పించాలని సైనిక మిత్ర బృందం సభ్యుడు బసవరాజ్ అదనపు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఆయన మాట్లాడుతూ బెంగళూరు ఏఆర్‌ఓ భారతీయ ఆర్మీ ద్వారా అగ్నివీర్ సైనికుల నియామక ప్రక్రియ జిల్లా స్టేడియంలో నిర్వహిస్తున్నారన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి అభ్యర్థులు పాల్గొంటారన్నారు. అభ్యర్థులకు వసతి, ఆహార సౌకర్యాలు తగినంత రవాణా కల్పించడానికి అన్ని ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి గందరగోళం తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లాయంత్రాంగాన్ని అభ్యర్థించారు. మాజీ సైనికుడు ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సైనిక్ మిత్ర బృందం

రసవత్తరంగా మేయర్ ఎన్నిక..!

- రాజకీయ కురువృద్ధుల పోటాపోటీ
- ఆరుగురు కార్పొరేటర్ల సిగపట్లు
- నేడు అధిష్ఠానం నుంచి పరిశీలకుల రాక



డిప్యూటీ మేయర్ సుకుం



విక్కీ



ముబీనా



ముండ్లూరు ప్రభంజన్



రామాంజనేయులు

బళ్లారి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): బళ్లారి మేయర్ ఎన్నిక రసవత్తరంగా మారింది. పదవి కోసం రాజకీయ కురువృద్ధులు గట్టిగా పోటీ పోటీపడుతున్నారు. గతంలో మాకు మిస్ అయింది. ఇప్పుడు ఇవ్వాలని కొందరు కోరుతున్నారు. మరికొందరు కాంగ్రెస్ పార్టీ పుట్టినప్పటి నుంచి సేవ చేస్తున్నామనీ, అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. 24వ వార్డు మేయర్ స్థానం జనరల్‌కు ఉపమేయర్ జనరల్ లేడీకి రిజర్వేషన్ ఖరారైయింది. 15న మేయర్, ఉపమేయర్, 4 స్థాయీ సమితి సభ్యుల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల అయింది. 24వ వార్డు మేయర్ పదవికి 3వవార్డు కార్పొరేటర్ ముండ్లూరు ప్రభంజన్, 23వ వార్డు కార్పొరేటర్ గాదెప్ప, 30వవార్డు కార్పొరేటర్ ఆసీఫ్, 26వ వార్డు కార్పొరేటర్ అయాజ్ కోడలు, ప్రస్తుత ఉపమేయర్ సుకుం, 28వ వార్డు కార్పొరేటర్ అల్లాబకాష్ కూతురు ముబీనా, 8వ వార్డు కార్పొరేటర్ రామాంజనేయులు, 20వ వార్డు కార్పొరేటర్ పేరం వివేక్ (విక్కీ) గట్టిగా పోటీ పడుతున్నారు. మేయర్ పదవి దక్కించుకోవడం కోసం వీరు ఎమ్మెల్యేలను, ఎంపీలను, ఇతర అధిష్ఠానం పెద్దలను ఆశ్రయిస్తున్నారు. ఇంకొందరు ఏకంగా సీఎం, డీసీఎంలను కలుస్తున్నారు.

- బళ్లారి నగర పాలికెలో మొత్తం 39 కార్పొరేటర్ల స్థానాలు ఉన్నాయి. ఇందులో బీజేపీ 13 స్థానాలు, కాంగ్రెస్ 26 మంది కార్పొరేటర్ల గెలిచారు.

మేయర్ పదవి ఆశించే వారిలో కాంగ్రెస్ కార్పొరేటర్లు ఎక్కువ. ఒక వేళ కాంగ్రెస్ పార్టీలో మేయర్ పదవి కోసం కార్పొరేటర్ల వర్గాలుగా చీలిపోతే బీజేపీకి అనుకూలించే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకుల అంచనా. ఒకవేళ కాంగ్రెస్ వర్గపోరు జరిగితే బీజేపీ మేయర్ పదవి ఆశించకుండా కాకున్నా బీజేపీకి అనుకూలించే మేయర్‌ను ఎంపిక చేసుకునే విధంగా రాజకీయ పావులు కదుపుతున్నారని సమాచారం. బళ్లారి నగరపాలికె మేయర్ ఎన్నిక విషయంలో బళ్లారి రూరల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి నాగేంద్ర, సిటీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, ఎంపీ నాసిర్ హుసేన్, ఎంపీ తుకారాం కీలకంగా వ్యవహరించే అవకాశం ఉంది.

నేడు బళ్లారికి పరిశీలకుల రాక

మేయర్ ఎన్నికల నేపథ్యంలో కార్పొరేటర్లతో చర్చలు చేసేందుకు కాంగ్రెస్ పార్టీ నుంచి ఇద్దరు సమన్వయకర్తలు గురువారం వస్తున్నట్లు పార్టీ వర్గాల ద్వారా సమాచారం. ఇక ఎంపీ నాసిర్ హుసేన్ బుధవారం రాత్రి బళ్లారికి చేరుకున్నారు. ఎమ్మెల్యే నాగేంద్ర కూడా గురువారం ఉదయం రానున్నారు. 15వ తేదీన జరిగే మేయర్ అభ్యర్థి ఎన్నికలో పార్టీ ఏ కార్పొరేటర్లను సూచిస్తుంది? అధిష్ఠాన వర్గం సూచించే కార్పొరేటరు మేయర్ అభ్యర్థిగా అందరూ సమ్మతిస్తారా? లేదా కార్పొరేటర్లకు నచ్చిన మరొకరిని ఎన్నికలో నిలబెట్టుకుంటారా? అప్పుడు బీజేపీ రాజకీయపాత్ర ఏమిటి అనే చర్చ సాగుతుంది. మేయర్ ఎన్నిక కొన్ని గంటలే మిగిలి ఉండడంతో బళ్లారిలో రాజకీయం రసవత్తరంగా మారింది.

టీబీ డ్యామ్‌కు పటిష్ట భద్రత

- విజయనగర, కొప్పళ జిల్లాల్లో విస్తృత తనిఖీలు



తుంగభద్ర డ్యామ్‌పై తనిఖీలు చేస్తున్న ఎస్పీ జాహ్నవి, పోలీసు సిబ్బంది

బళ్లారి గాంధీనగర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని ఎర్రకోట వద్ద సోమవారం సాయంత్రం జరిగిన పేలుడు ఘటన నేపథ్యంలో విజయనగర జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. పేలుడు జరిగిన రాత్రి నుంచే పోలీసులు పలు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. హొసపేట పట్టణంలో లాడ్జిలు, హోంస్టేలో నివాసం ఉంటున్న వ్యక్తుల సమాచారాన్ని సేకరించారు. రైల్వే పోలీసు స్టేషన్, బస్టాండు, ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో పోలీసులు తనిఖీలు చేశారు. ఇదే సందర్భంలోనే రైతుల జీవనాడిగా నిలిచిన తుంగభద్ర జలాశయానికి గట్టిభద్రత ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ ఎస్.జాహ్నవి డ్యామ్ వద్దకు చేరకుని శ్వానదళాలతో తనిఖీలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ప్రముఖ ప్రాంతాలు, జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాలు, అనుమానస్పద వ్యక్తుల కదలికలపై నిఘా పెట్టినట్లు ఎస్పీ మీడియాకు వివరించారు. ప్రపంచ పర్యాటక ప్రాంతమైన హంపిలో కూడా పోలీసులు తనిఖీలు కొనసాగాయి. కొప్పళ్ నగరంలోని బస్టాండులో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో బిహార్‌కు చెందిన యువకులకు చెందిన బ్యాంకులు, వారు తెచ్చుకున్న వస్తువులపై శ్వానదళాలతో పరీక్షించారు. అందరి బ్యాగుల్లోనూ ఆహార పదార్థాలతో పాటు ప్లాస్టిక్ ప్యాకెట్లు ఉండడంతో వాటిని గాంజా కలిగిన ప్యాకెట్లుగా భావించి వారిని విచారణ నిమిత్తం పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్ళారు. భయపడిన యువకులు పోలీసుల నుంచి తప్పించుకునే ప్రయత్నం చేశారు. విచారణ అనంతరం వారి వద్ద ఉన్న ప్లాస్టిక్ ప్యాకెట్లలో గాంజా కాదని, పొగాకు ఉత్పత్తులుగా గుర్తించినట్లు ఎస్పీ రామ్ ఎల్.అరసిద్ది మీడియాకు వివరించారు.



కొప్పళ సెంట్రల్ బస్టాండులో సోదాలు చేస్తున్న పోలీసులు

మహాబలేశ్వరప్పకు ఘన నివాళి



మహాబలేశ్వరప్ప చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న వీరశైవ సంఘం నాయకులు

బళ్లారి సిటీ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నగరంలోని బహదూర్ వై.మహాబలేశ్వరప్ప టెక్నికల్ కళాశాలలో బుధవారం రావు బహద్దూర్ వై.మహాబలేశ్వరప్ప వర్ధంతిని నిర్వహించారు. ప్రిన్సిపాల్ హనుమంతరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సవితా సోనోళి మాట్లాడుతూ మహాబలేశ్వరప్ప జీవిత విజయాలను ఆయన వ్యక్తిత్వం, పోరాట పటిమ, ఆయన నిర్మించిన విద్యాసంస్థలు, 1930-40లలో బళ్లారి జిల్లా సమగ్ర అభివృద్ధికి ఆయన వేసిన మార్గాన్ని వివరించారు. 1945లో వీరశైవ విద్యావర్ధక సంఘం అధ్యక్షుడిగా వీరశైవ డిగ్రీ కళాశాలను ప్రారంభించడానికి ఆయన చేసిన కృషి, సేకరించిన రూ.3 లక్షల విరాళం, అప్పటి బ్రిటీషు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రభుత్వం నుంచి వంద ఎకరాల భూమిని పొందడానికి ఆయన చేసిన పోరాటం అనిర్వచనీయమన్నారు. 1946లో బళ్లారి జిల్లా బోర్డు అధ్యక్షుడిగా రోడ్లు, వంతెనలు, తాగునీరు, హగరి వంతెన, కన్నడ పాఠశాలలు, కర్ణాటక ఏకీకరణ పోరాటం, మల్లసజ్జన వ్యాయామశాల స్థాపన, ఆసుపత్రుల స్థాపన, కళలు, గ్రంథాలయాలకు ప్రోత్సాహానికి ఎంతో కృషి చేశారన్నారు. అధ్యక్షుడు జానకుంటే బసవరాజు మాట్లాడుతూ మహాబలేశ్వరప్ప తన జీవితాంతం అనుసరించిన సూత్రాలు, విలువలు విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. అప్పుడే జీవిత విలువలను సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో వీరశైవ విద్యావర్ధక సంఘం అధ్యక్షుడు కణేకల్ మహంతేశ్, అరవిందపటేల్, మేటి పంపనగౌడ, యర్రిస్వామి, మేనేజ్‌మెంట్ బోర్డు సభ్యులు ప్రభుస్వామి, ప్రకాశ్ పాల్గొన్నారు.

'సుకన్యపై దాడి అమానుషం'

బళ్లారి సిటీ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): బెంగళూరులో ఇటీవల సుకన్య అనే మైనారిటీ ట్రాన్స్‌జెండర్‌పై అదే వర్గానికి చెందిన కొందరు దాడి చేసి గుండు చేయించి అమానించడం అమానుషమని జెండర్ అండ్ సెక్సువల్ ప్లూరలిజం మూవ్‌మెంట్ ఆర్గనైజేషన్‌కు చెందిన వీణ ఖండించారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ దేశంలో మొత్తం ఏడు హిజ్రా ధర్మాలు ఉన్నాయన్నారు. ఒక ఇంటి నుంచి మరో ఇంటికి మారడం సర్వసాధారణమన్నారు. అదే విధంగా బెంగళూరులోని కృష్ణరాజపురంలో నివసించిన సుకన్య అనే మహిళ ఒక ఇంటిని వదిలి మరో ఇంటికి వెళ్లిందన్నారు. దీనిని పెద్ద కారణంగా భావించి చైత్ర, ప్రకృతి వర్గం నుంచి ఏడుగురు ట్రాన్స్‌జెండర్లు ఆమెను అక్కడి నుంచి అపహరించి బలవంతంగా మద్యం తాగించి నోట్లో గుడ్డను కుక్కి కర్ర ఇతర మారణాయుధాలతో దాడి చేశారు. ఆ దృశ్యాలను మొబైల్‌లో వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారన్నారు. ఎవరైనా మన ఇంటికి వస్తే లేదా మన ఇంటి నుంచి ఎవరినైనా లాక్కోవడానికి ప్రయత్నిస్తే వారి గతి ఇలాగే ఉంటుందని హెచ్చరించారన్నారు. ఈక్రూరమైన చర్యకు పాల్పడిన వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధ్యులైన వారిని రాష్ట్ర ప్రభుత్వం కఠిన శిక్షించాలని డిమాండ్ చేశారు. సంబంధిత పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. శివాని, రాజమ్మ, దివ్యభవాని, అశ్విని, రాజేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీణ తదితరులు

రోడ్డు మరమ్మతుల పరిశీలన

రాయచూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నగరంలో చేపట్టిన రోడ్డు మరమ్మతు పనులను మహానగర పాలికె కమిషనర్ జుబిన్ మొహపాత్ర బుధవారం పరిశీలించారు. నగరంలోని ఇంజనీయరింగ్ విభాగం అధికారులతో కలిసి సియాతలాబ్, మామిడి చెరువు, ఆశ్రయ కాలనీ, ఎల్‌బీఎస్ నగర్ తదితర ప్రాంతాల్లో చేపట్టిన రోడ్ల మరమ్మతు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రోడ్ల నిర్మాణంలో పూర్తి జాగ్రతలు తీసుకోవాలని ఇంజనీర్లను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పనుల పూర్తిని నాణ్యతను పరిశీలించిన అనంతరమే వాటికి ఆమోదం తెలపాలని ఆదేశించారు. సుదీర్ఘ విరామం అనంతరం కోటికి పైగా అంచనా వ్యయంతో నగరంలో రోడ్ల మరమ్మమతులు, గుంతలు పూడ్చే పనులను అధికారులు టెండర్లు ఖరారు చేసి పనులు చేపట్టారు.



మామిడి చెరువులో రోడ్డు పనులను పరిశీలిస్తున్న కమిషనర్

హోసూరు జోన్

బాగలూరు రోడ్డులో పార్కు

హోసూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): బాగలూరు రోడ్డులోని ఎన్‌జీజీఓఎ కాలనీలో పిల్లల పార్కుకోసం 87 సెంట్ల భూమిని కేటాయించారు. 20 సంవత్సరాలుగా వృథాగా ఉన్న ఈ స్థలాన్ని ఇటీవల ప్రైవేట్‌కంపెనీ తన సామాజిక బాధ్యతతో రూ.13లక్షలను కేటాయించడంతో పార్కును అభివృద్ధి చేశారు. పార్కును ఎట్టకేలకు మేయర్ సత్య బుధవారం ప్రారంభించారు. పార్కులో వాకింగ్ ట్రాక్, సీటింగ్, పిల్లల ఆట పరికరాలు, పచ్చటి గడ్డి, లైటింగ్ సౌకర్యాలు, మరుగుదొడ్ల సదుపాయంతోపాటు వెయ్యికంటే ఎక్కువ మొక్కలు, చెట్లను నాటడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్పొరేషన్ జోన్ చైర్మన్ రవి, కాలనీ పీపుల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ నీలకండ పిళ్ళై, కార్యదర్శి సెల్వం తదితరులు పాల్గొన్నారు.



పార్కును ప్రారంభిస్తున్న మేయర్ సత్య



ఆందోళనకారులను అడ్డుకుంటున్న పోలీసులు

డిమాండ్ల సాధనకు నిరసన

హోసూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆదిద్రావిడ వర్గాల ప్రజలకు జిల్లా యంత్రాంగం అన్యాయం చేస్తోందని ఆరోపిస్తూ సూలగిరిలో విదులు సిరుతైగల్ పార్టీ (వీకేసీ) ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. ఆదిద్రావిడ సంక్షేమశాఖ స్వాధీనం చేసుకున్న భూమికి ఇంటి పట్టాలు ఇవ్వాలని కోరుతూ రాస్తారోకో నిర్వహించారు. చిక్కబువతి, తొట్టబువతి గ్రామాల్లో అక్రమాలకు గురైన ఆలయ భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలన్నారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు ఆందోళనకారులను చెదరగొట్టారు. నిరసనలో పార్టీ సభ్యులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



పాదయాత్రలో పాల్గొన్న రైతులు, నాయకులు

రబీ పంటకు నీరివ్వాలని రైతుల పాదయాత్ర

బళ్లారి సిటీ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర అచ్చుకట్టు ప్రాంతానికి రబీసాగుకు నీరివ్వాలని రైతు సంఘం అధ్యక్షుడు మాధవరెడ్డి ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. బుధవారం సిరుగుప్ప తాలూకా కరూరు గ్రామం నుంచి తుంగభద్ర జలాశయం వరకు పాదయాత్రను ప్రారంభించారు. కరూరు నుంచి ప్రారంభమైన పాదయాత్ర కురుగోడు, ఎమ్మిగనూరు, కంప్లి, కమలాపూర్ గుండా 17వ తేదీన తుంగభ్రద జలాశయానికి చేరి అక్కడ నిరసధర్నా చేపట్టనున్నట్లు మాధవరెడ్డి తెలిపారు. జలాశయంలోని అన్నిగేట్లను వచ్చే జూన్‌లో మరమ్మతులు చేయాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. తుంగభద్ర జలాశయం నీటి సలహా సమితి సభ 14న బెంగళూరులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కమిటీ అధ్యక్షుడు మంత్రి శివరాజ తంగడగి, జల సంపన్మూల మంత్రి డీకే శివకుమార్, తుంగభ ద్ర అచ్చుకట్టు ప్రాంతానికి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు సమావేశంలో పాల్గొంటారన్నారు. సభలో రెండో పంటకు నీరు ఇవ్వాలని తీర్మానించాలని ఆయన కోరారు. పలు రైతు సంఘాలు, నాయకులు పాల్గొన్నారు.

గ్రామీణ విద్యార్థుల చదువుకు ప్రాధాన్యం

- ఎమ్మెల్యే హెచ్ఆర్ గవియప్ప



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

హొస్పేట్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): గ్రామీణ పేద విద్యార్థుల విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే హెచ్ఆర్ గవియప్ప అన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో విద్యా రంగానికి రూ.12 కోట్ల గ్రాంట్ కేటాయించామన్నారు. బుధవారం పీకే హళ్లిలో అప్‌గ్రేడ్ చేసిన ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలు అభివృద్ధి చెందితేనే గ్రామీణ పిల్లలకు ఉన్నత విద్య సాధ్యమవుతుందని అన్నారు. ఇంతకుముందు విద్యార్థులు ఉన్నత పాఠశాల కోసం 10 కి.మీ ప్రయాణించాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం అప్‌గ్రేడ్‌తో ఆ సమస్య తీరనుందన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలు గ్రామంలో అనుకూల స్థలం గుర్తిస్తే కొత్త ఉన్నత పాఠశాల భవనం, స్టేడియం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అథ్లెట్లకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి రూ.5 కోట్లను వినియోగిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. పి.కె హళ్లి, నాగేనహళ్లి, బసవనదుర్గ, గడిగనూర్, కమలాపూర్ పాఠశాలల్లో స్టేడియంలు అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. ఏరియా విద్యా అధికారి శేఖర్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో మొదటిసారిగా రెండు ఉన్నత పాఠశాలలు అప్‌గ్రేడ్ చేయడం గర్వకారణమని అన్నారు. ఎమ్మెల్యే గవియప్ప రెండు సంవత్సరాల్లో ఆరోగ్యం, విద్య రంగాలకు కలిపి రూ.68 కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు. 328 పాఠశాల గదులు మరమ్మతు చేయగా, 142 కొత్త భవనాలు, 30 హైటెక్ టాయిలెట్లు నిర్మించారని తెలిపారు. పీకే హళ్లి గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు అంక్లమ్మ, తాలూకా పంచాయతీ ఈఓ ఆలంబాషా, ఎస్‌డీఎంసీ అధ్యక్షుడు వీరేష్, సభ్యులు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి సమావేశం

హొస్పేట్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): హొస్పేట్ తాలూకా గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలు పరిష్కారానికి 15 తేదీన సమావేశం నిర్వహిస్తున్నట్లు విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఒక ప్రకటనలో తెలిపారు. హొస్పేట్ నగరంలోని గ్రామీణ ఉపవిభాగ కార్యాలయంలో వినియోగదారుల సంభాషణ సమావేశం ఉంటుందన్నారు. తాలూకా పరిధిలో ఉన్న విద్యుత్ వినియోగదారులు సమావేశనికి హాజరై తమ సమస్యలు, ఫిర్యాదులు, సూచనలు సమర్పించాలని కోరారు. వినియోగదారుల నుంచి అందిన ఫిర్యాదులను సంబంధిత అధికారుల సమక్షంలో పరిష్కరించనున్నట్లు తెలిపారు.

డాక్టర్ గోవిందుకు జాతీయ విద్యా పురస్కారం



హొస్పేట్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) కన్నడ విశ్వవిద్యాలయం లోని కన్నడ సాహిత్య అధ్యయన విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గోవిందుకు ప్రతిష్ఠాత్మక మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి విద్యా పురస్కారం లభించింది. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా ఉత్తరప్రదేశ్‌లోని గోండా జిల్లా శాంతి ఫౌండేషన్ ఈ పురస్కారాన్ని అంజేశారు. కర్ణాటక రాష్ట్రం నుంచి ఎంపికైన రెండవ వ్యక్తి డాక్టర్ గోవింద అని ఫౌండేషన్ అధ్యక్షుడు కుమార్ తెలిపారు. గోవింద సాహిత్య రంగంలో, విశ్వవిద్యాలయ బోధనలో విశేష సేవలు అందించారని ఆయన ప్రశంసించారు. ఎంపికైన డాక్టర్ గోవిందను కర్ణాటకకు చెందిన డాక్టర్ సునీల్ పెరిట్, డాక్టర్ ఎల్లప్ప, కేకే పూరా, డాక్టర్ మలకప్ప, అలియాస్ మహేష్, ప్రొఫెసర్లు రీసెర్చ్ స్కాలర్లు, విశ్వవిద్యాలయ సిబ్బంది అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో బైక్ రైడర్ మృతి

రాయచూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నగరంలోని స్టేషన్ రోడ్డులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్ పై వెళుతున్న యువకుడు దుర్మరణం పాలయ్యాడు. మృతి చెందిన వ్యక్తిని సిటీ ఎమ్మెల్యే డాక్టర్ శివరాజ్ పాటిల్ కారు డ్రైవర్ మహ్మద్ రఫీ(38)గా పోలీసులు గుర్తించారు. ఎదురుగా వస్తున్న మరో వాహనం ఢీకొట్టడంతో ఈ ప్రమాదం సంభవించింది. ఘటనా స్థలాన్ని పశీలించిన ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు.

అబుల్ కలాం ఆజాద్ సర్కిల్ ఏర్పాటు చేయండి

కంప్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అబుల్ కలాం ఆజాద్ 136వ జయంతిని పురస్కరించుకుని బుధవారం కొత్త బస్టాండ్ వద్ద విద్యాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ ముస్లిం డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు హొన్నూరుసాబ్ మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా అబుల్‌కలాం సర్కిల్ నిర్మాణం, విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. అది ఇంకా అమలు కాలేదన్నారు. బస్టాండ్ వద్ద ప్రమాదాలను నివారించడానికి సర్కిల్ నిర్మించాలని కోరారు. సాయంత్రం వేళల్లో లైటింగ్ ఏర్పాటు చేస్తే మరింత ఆకట్టుకుంటుందన్నారు. అబుల్ కలాం ఆజాద్ దేశ స్వాతంత్ర్య సమరయోధుడు, హిందువులు, ముస్లింలను ఏకం చేయడంలో ముఖ్యమైన పాత్ర పోషించారని ప్రధాన కార్యదర్శి నాడా ఎం రాజభక్షి అన్నారు. కన్నడ, ఉర్దూ వివిధ అంశాలపై పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కమిటీ ఉపాధ్యక్షుడు సయ్యద్ రాజాసాబ్, ప్రముఖులు ఎండీ యూనుస్, ఎం మహబూబ్, ఖాసీం, మహబూబ్ బాషా, హసన్, మహమ్మద్, సాహెబ్ ఖాద్రీ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న విద్యార్థులు, నాయకులు